www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం,
24 జూన్ 2023, హైదరాబాద్
సంపుటి: 1, సంచిక: 244

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## పార్టీ మారుతామనే వాళ్లను ఆపబోం..

### బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**స్టేట్ బ్యూరో -విశాల భారతి:** తెలంగాణ బీజేపీలో అసంతృప్తులు ఉన్నారని, ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు పార్టీ మారుతారని వార్తలు జోరుగా వస్తున్న తరుణంలో టీబీజేపీ చీఫ్ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో నేతల మధ్య విభేదాల గురించి రిపోర్టు అడిగిన ప్రశ్నలకు ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. పార్టీ మారడం అనేది వారి వారి రాజకీయల ఆలోచనలకు అనుగుణంగా మిగతా 2లో



# సార్వత్రిక ఎన్నికల్లో కలిసి పోరాడతాం

## 17 పార్టీలు కలిసి పోటీకి నిర్ణయం

### పాట్నాలో 15 ప్రతిపక్ష పార్టీలు సమావేశం

### జాతీయ ప్రయోజనాల కోసమే విపక్షాల ఐక్యత అంటూ వ్యాఖ్య

### త్వరలోనే మరోసారి విపక్షాల భేటీ ఉంటుందని ప్రకటన

**స్టేట్ బ్యూరో -విశాల భారతి:** బీజేపీ సర్కారును గద్దె దించేందుకు విపక్ష పార్టీలన్నీ కలిసి ఎన్నికల్లో పోరాడతాయని బీహార్ సీఎం నీతీశ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పాట్నాలో 15 విపక్ష పార్టీలు భేటీ అయ్యాయి. చర్చల అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించాయి. ఇందులో మాట్లాడిన నీతీశ్..మొత్తం 17 పార్టీలు కలిసే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తాయని ప్రకటించారు. విపక్ష పార్టీల సమావేశం బాగా జరిగిందని అన్న ఆయన.. వివిధ పార్టీల నేతలు సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు చెప్పారు. త్వరలోనే మరోసారి భేటీ అవుతామని వెల్లడించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్‌లోని శిమ్లాలో నిర్వహించనున్నట్లు చెప్పారు. వచ్చే సమావేశంలో ఉమ్మడి అజెండాను రూపొందించుకుంటామని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఎన్ని విభేదాలు ఉన్నా.. కలిసే పోరాడతామని బంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అయితే, ఒంటరిగా పోరాడటం చేతగాకే.. ఇతర పార్టీల మద్దతును కాంగ్రెస్ కోరుతోందని బీజేపీ విమర్శించింది. జాతీయ ప్రయోజనా లను దృష్టిలో పెట్టుకొనే తామంతా కలిసినట్లు చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారు దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నారని ధ్వజమెత్తారు.

### ‘త్వరలోనే ఉమ్మడి అజెండా’

2024 లోక్‌సభ ఎన్నికల కోసం ఉమ్మడి అజెండాను వచ్చే సమావేశంలో నిర్ణయిస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. బీజేపీని ఓడించాలంటే రాష్ట్రాలవారీగా వేర్వేరు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. మరోవైపు, విపక్ష పార్టీల మధ్య కొన్ని విభేదాలు ఉన్నాయన్న రాహుల్ గాంధీ.. తమ భావజాలాన్ని కాపాడుకుంటూనే వాటిని పరిష్కరించుకునేందుకు చర్చలు జరపాలని నిర్ణయించినట్లు చెప్పారు. పాట్నా నుంచి ఏది మొదలైనా.. అది ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటుందని బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. బీజేపీకి వ్యతిరేకంగా తామంతా ఐక్యంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఉమ్మడిగానే కాషాయ పార్టీని ఎదుర్కొంటామని ప్రకటించారు. చరిత్రను మార్చాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కానీ అది జరగకుండా తాము అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

## తెలంగాణతోనే నా భవిష్యత్తు..

### -కాంగ్రెస్‌లో విలీనం వార్తలపై షర్మిల క్లారిటీ



**హైదరాబాద్-విశాల భారతి:** వైఎస్సార్టీపీని కాంగ్రెస్‌లో విలీనమంటూ వస్తున్న వార్తలను ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల కొట్టిపారేశారు. “నా చివరి శ్వాస వరకు తెలంగాణ బిడ్డగా..తెలంగాణ కొరకు పోరాడుతూనే ఉంటది.. ఊహాజనిత కథలు కల్పిస్తూ, నాకు, తెలంగాణ ప్రజల మధ్య అగాధాన్ని సృష్టించే విఫలయత్నాలు జరుగుతున్నాయి.. పనిలేని, పసలేని దార్శనికులకు నేను చెప్పేది ఒకటే. నా రాజకీయ భవిత మీద పెట్టే దృష్టిని, సమయాన్ని కేసీఆర్ పాలనపై పెట్టండి.. అన్నివిధాలుగా కేసీఆర్ సర్కారు పాలనలో.. సర్వనాశనమైపోతున్న తెలంగాణ భవితమీద పెట్టండి. కేసీఆర్ కుటుంబం అవినీతిని ఎండగట్టండి. నా భవిష్యత్తు తెలంగాణతోనే. నా ఆరాటం, నా పోరాటం తెలంగాణ కోసమే.. జై తెలంగాణ” అంటూ షర్మిల ట్వీట్ చేశారు.

# దశాబ్ది దగా..!

### పునర్నిర్మాణం అంటే దొరల గడీల నిర్మాణమా?

### ధరణితో పేదల భూములను కొల్లగొడుతున్న అధికార పార్టీ నేతలు

### ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఊసే లేదు

### తెలంగాణలో రాచరికం, నియంత పాలనా

### దశాబ్ది కాలములో ప్రజలకు నిరాశే మిగిలింది

### హామీలన్నీ చెత్తబుట్టలో వేసిన కేసీఆర్






**హైదరాబాద్ స్టేట్ బ్యూరో:** తెలంగాణ కల సాకరమై 10 ఏండ్లవుతున్నా నేపథ్యంలో ప్రభుత్వం 22 రోజులపాటు సాగిన దశాబ్ది ఉత్సవాల పేరిట సంబురాలు చేసింది. అమరుల స్మారకం ప్రారంభంతో సంబురాలు ముగిసాయి. అయితే, కేసీఆర్ ఉద్యమ నేతగా మొదలై.. ప్రస్తుతం రాజ్యాధినేతగా మారారు. అమరుల త్యాగాలతో నెరవేరిన తెలంగాణలో వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలనా సాగిస్తున్నట్లు కేసీఆర్ స్పష్టం చేశారు. గులాబీ పార్టీ పాలనలో అన్ని వర్గాలు సంపన్నులుగా మారాయని, అన్ని రంగాల్లో తెలంగాణ వెలిగిపోతుందని చెప్పారు.

#### పేదలు పేదలుగానే

కానీ, ఆనాటి ఉద్యమంలో పాల్గొన ప్రజా కవులు, కళాకారులు, ఉద్యమ నేతలు, ప్రజాసంఘాల నేతలు మాత్రం కేసీఆర్ చెప్పిన మాటలను ఒప్పుకోవడం లేదు. కేసీఆర్ చెప్పేవన్నీ పైన పైటారమని, పేదలు పేదలుగానే ఉన్నారని, కేసీఆర్ పాలనలో అవినీతి రాజ్యమేలుతుందని అభిప్రాయపడుతున్నారు. కేసీఆర్ ఏ హామీలనైతే చెప్పి అధికారంలోకి వచ్చారో.. వాటన్నింటినీ చెత్తబుట్టలో పడేశారని మండిపడుతున్నారు. నీళ్ళు, నిధులు, నియామకాలు అనే ముఖ్యమైన హామీలు పక్కకు పోయాయని విమర్శించారు.

#### దొరల గడీలు పునర్నిర్మాణం

పునర్నిర్మాణం అంటే దొరల గడీలు పునర్నిర్మాణం అవుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు ఏమి మేలు జరగలేదని స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన వందలాది ఎకరాల భూములను కొట్టేయడానికే ధరణి వెబ్ సైట్ ను తీసుకొచ్చారని, దాన ఆసరాగా చేసుకొని పేదల ప్రజల భూములను అధికార పార్టీ నేతలు మిగతా 2లో

### నియంత పాలనా

ఆత్మగౌరవం, స్వాభిమానం, స్వయం పాలన కోసం సాధించుకున్న తెలంగాణలో ఈరోజు రాచరిక, నియంత పాలనా సాగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యమం ఉధృత సమయంలో కేసీఆర్ కుటుంబ సభ్యులను తీసుకొచ్చి ఉద్యమపార్టీని కుటుంబ పార్టీగా మార్చిందని గుర్తుచేసుకుంటున్నారు. అనంతరం కేసీఆర్ కుటుంబం అధికారాన్ని పూర్తిగా అనుభవిస్తుందన్నారు. పదవులను అడ్డం పెట్టుకొని, తమకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి వేల కోట్లను వెనకేసుకొని బాగా పైకొచ్చారని ఉద్యమ నేతలు మండిపడుతున్నారు.

## పండుటాకుల మోములో బర్త్ డే చిరునవ్వులు..

### వృద్ధాశ్రమంలో ఎస్ఆర్ఆర్ ఫార్చ్యూన్ ఇన్ ఫ్రా ఎండీ పుట్టిన రోజు వేడుకలు




2లో

## 1827 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

2లో

## హైదరాబాద్‌లో స్కైవేల కోసం రక్షణ శాఖ భూములు కేటాయించండి

: మంత్రి కేటీఆర్

2లో

# ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం మరో గుడ్‌న్యూస్

### 30 శాతం అలవెన్స్‌లు పెంపు

**హైదరాబాద్-విశాల భారతి:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేళ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం మరో గుడ్‌న్యూస్ చెప్పింది. ఉద్యోగులు, పెన్షనర్ల ఇచ్చే అలవెన్స్‌లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విభాగాల వారీగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను ట్విట్టర్ వేదికగా వెల్లడించిన మంత్రి హరీష్ రావు..సీఎం కేసీఆర్ గారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు అలవెన్సులు, ప్రయోజనాలను పెంచిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు ట్రావెలింగ్ అండ్ కన్వీనియన్స్ అలవెన్స్ 30శాతం పెంచింది. అలాగే బదిలీపై వెళ్లే ఉద్యోగులకు ట్రాన్స్ పోర్ట్ అలవెన్స్ 30 శాతం పెంచింది. సెలవురోజుల్లో పనిచేసే లిఫ్ట్ ఆపరేటర్లు, డ్రైవర్లకు అదనంగా రూ. 150 చెల్లించాలని నిర్ణయించింది. షెడ్యూల్ ఏరియాలో పనిచేసే ఉద్యోగులకు స్పెషల్ కాంపన్సెటరీ అలవెన్స్ 30 శాతం పెంచింది. దివ్యాంగ ఉద్యోగులకు ఇచ్చే కన్వీయన్స్ అలవెన్స్ రూ. 2000 నుంచి రూ. 3000 పెంచింది. ఇళ్లు నిర్మించుకునే వారికి ఇచ్చే అడ్వాన్స్ పరిమితిని రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షలకు పెంచింది. కారు కొనుగోలు చేసే వారికి ఇచ్చే అడ్వాన్స్ పరిమితిని రూ. 6లక్షల నుంచి 9 లక్షలకు పెంచింది. మోటార్ సైకిల్ కొనుగోలు చేసే వారికి ఇచ్చే అడ్వాన్స్ రూ. 80 వేల నుంచి రూ. లక్షకు పెంచింది. ఉద్యోగుల పిల్లల పెళిళ్ళకు సంబంధించి.. కూతురు పెళ్లికి ఇచ్చే అడ్వాన్స్ రూ. లక్ష నుంచి రూ. 4 లక్షలు, కొడుకు పెళ్లికి ఇచ్చే అడ్వాన్స్ రూ. 75 వేల నుంచి రూ. 3 లక్షలకు పెంచింది. స్టేట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్ ఉద్యోగులకు ఇచ్చే ఇన్సెంటివ్ 30శాతం పెంచింది. పెన్షనర్లు చనిపోతే అందించే తక్షణ సాయం 20 వేల నుంచి 30 వేలకు పెంచుతున్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గ్రేహౌండ్స్, ఇంటిలిజెన్స్, ట్రాఫిక్, సీఐడీ, ఆక్టోపస్, యాంటి నక్సలైట్ స్క్వాడ్ విభాగాల్లో పని చేసే పోలీసులకు ఇచ్చే స్పెషల్ పేస్‌ను 2020 పే స్కేల్ ప్రకారం వర్తింపచేస్తారని పేర్కొంది. ప్రోటోకాల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తించే అన్ని కేటగిరీల్లోని ఉద్యోగులకు అదనంగా 15 శాతం స్పెషల్ పే మంజూరు చేసింది.



# పార్టీ మారుతామనే వాళ్లను ఆపబోం..

**మొదటి పేజీ తరువాయి**

ఉంటుందని అన్నారు. కాంగ్రెస్‌ను పరోక్షంగా పేర్కొంటూ.. మునిగిపోయే నావలోకి వెళ్లుతామనే వాళ్లను తాము ఎవ్వరమూ ఆపబోమని స్పష్టం చేశారు. డిపాజిట్లు రాని, అసలు అభ్యర్థులే లేని పార్టీలోకి ఎవరు పోతారనేది అసలు ప్రశ్న అని తెలిపారు. తమ పార్టీ నుంచి ఎవరూ పోవడం లేదని అన్నారు. అది కేవలం మీడియా దుష్ప్రచారం అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై మరింత స్పష్టత కోసం విలేకరులు ప్రశ్నించగా...తమ పార్టీ నుంచి ఎవ్వరూ పోరు అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన అటు కాంగ్రెస్‌ను ఇటు బీఆర్ఎస్‌ను విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఆదరణే లేదని, అందులోకి తమ పార్టీ నుంచి ఎవరూ పోవడం లేదని అన్నారు. ఎన్నికలు సమీపించగానే కేసీఆర్‌కు అమ–రవీరులు గుర్తుకువచ్చారా? అంటూ ప్రశ్నించారు. ఏనాడూ కనీసం అమరవీ–రులకు జోహార్లు చెప్పలేదని, ఇవాళ విపరీత ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందిస్తామని చెప్పారు.

# దశాబ్ది దగా..!

**మొదటి పేజీ తరువాయి**

కొల్లగొడుతున్నారని విమర్శలు ఉన్నాయి.

### ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వ నిధులు వెచ్చిస్తూ పార్టీ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రజల పైసలతో గులాబీ పార్టీ ప్రచారం నిర్వహించిందని, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిందని మండిపడుతున్నారు. తెలంగాణ వచ్చాన సీఎం హామిలిచ్చిన కేజీ నుంచి పీజీ ఉచిత నిర్బంధ విద్య, ఫీజ్ రీయంబర్స్ మెంట్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, పోడు భూములకు పట్టాలు, రైతు రుణ మాఫీ, 12 శాతం ముస్లిం రిజర్వేషన్లు, 12 శాతం గిరిజన రిజర్వేషన్లు ఇస్తానని చెప్పిన పది హామీలల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### తెలంగాణ ద్రోహులకే అధికారం

ఉద్యమ సమయంలో నిరంతరం స్మరించిన భూపతి కృష్ణమూర్తి, ఆచార్య జయశంకర్, కేశవ్‌రావ్ జాదవ్ లను ఇప్పుడు విస్మరించిందని విమర్శలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించి, అణగతొక్కిన నాటి ప్రభుత్వంలో ఉన్న తెలంగాణ ద్రోహులు నేడు మంత్రులుగా అధికారాన్ని వెలగబెట్టడంపై మండిపడుతున్నారు. తెలంగాణలో కేసీఆర్, కేసిఆర్ కుటుంబం, మంత్రులు, ఎమ్మెల్యే మాత్రమే బాగుపడ్డారని, కేసిఆర్ ఆయన కటుంబ సభ్యులు వేల కోట్లు సంపాదించారని ఆరోపిస్తున్నారు.

### ప్రజా ధనం వృధా

దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్ల రూపాయల ప్రజా ధనం వృధా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టి డబుల్ బెడ్ రూం ఇండ్లు సామన్యుల్లో ఆశలు పెంచాయి. కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇస్తాడని వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్న ప్రజలకు దశాబ్ది కాలములో నిరాశే మిగిలింది. పోడు భూములకు పట్టాలిస్తానని 9 ఏండ్లుగా ఊరిస్తున్న కేసీఆర్.. దశాబ్ది కాలం అయినా సమస్య పరిష్కరిస్తారో లేదో అన్న అపనమ్మకంలో లబ్దిదారులు ఉన్నారని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ఇవ్వలేదని ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాబోయే ఎన్నికల్లో అన్ని ఆలోచించుకొని ఓటు అస్త్రాన్ని వినియోగించాలని కోరారు.

# 1827 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ఆర్థిక శాఖ అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ**



**హైదరాబాద్– విశాల భారతి:** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని టీచింగ్ ఆసుపత్రుల్లో 1827 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అనుమతులు మంజూరు చేస్తూ శుక్రవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ మెడికల్ హెల్త్ అండ్ రిక్రూట్మెంట్ బోర్డ్ డైరెక్ట్ రిక్రూట్మెంట్ పద్ధతిన భర్తీ చేయనున్నది. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే సీఎం కేసీఆర్ గారి లక్ష్యాన్ని వేగంగా చేరుకుంటున్నామని ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు చెప్పారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 5 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 26కు చేరిందన్నారు. వచ్చే ఏడాదిలో మరో 8 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీంతో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ అవుతుండటంతో పాటు, తెలంగాణ బిడ్డలకు వైద్య విద్య చేరువ అవుతున్నదన్నారు. మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన వైద్యులను, నర్సులను, ఇతర సిబ్బందిని భర్తీ చేస్తున్నదన్నారు. ఇప్పటికే 1061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ ప్రక్రియ పూర్తి చేసి, వారిని టీచింగ్ ఆసుపత్రుల్లో నియమించుకోగా, ప్రస్తుతం 1827 మంది స్టాఫ్ నర్సులను భర్తీ చేసుకోబోతున్నామన్నారు. దీంతో ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుతాయన్నారు. 1827 మందికి ఉద్యోగ అవకాశం కలుగుతుందన్నారు.

# హైదరాబాద్‌లో స్కైవేల కోసం రక్షణ శాఖ భూములు కేటాయించండి : మంత్రి కేటీఆర్

**న్యూఢిల్లీ :** హైదరాబాద్‌లో స్కైవేలు, స్కై వాక్స్ కోసం రక్షణ శాఖ భూములు కేటాయించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరినట్లు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్.. రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఇవాళ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకొని పోతున్నదని మేం చెప్పుకోవడం కాదు.. కేంద్ర ప్రభుత్వమే చెప్తుంది అని కేటీఆర్ తెలిపారు. అయితే ఈ అభివృద్ధి పరంపర కొనసాగే క్రమంలో.. తెలంగాణ రాష్ట్రం వేగంగా ఎదుగుతూ, విస్తరిస్తూ జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుంది. కాబట్టి ఈ రాష్ట్రానికి చేయూతనివ్వండి, మద్దతు ఇవ్వండి. తద్వారా జాతి నిర్మాణంలో మరింత ఉధృతంగా పాల్గొనే అవకాశం వస్తుంది. భారతదేశానికి కూడా లాభం జరుగుతుందనే మాటను కేంద్రానికి చాలాసార్లు చెప్పామని కేటీఆర్ గుర్తు చేశారు.

**తొమ్మిదేండ్లలో ఐదుగురు రక్షణ శాఖ మంత్రులను కలిశాం..**

స్కైవేలు, స్కై వాక్స్ కోసం రక్షణ శాఖ భూములు కేటాయిస్తే.. ల్యాండ్ ఫర్ ల్యాండ్ కూడా ఇస్తామని, తొమ్మిదేండ్ల కాలంలో ఐదుగురు రక్షణ శాఖ మంత్రులను 15 నుంచి 20 సార్లు కలిశామని కేటీఆర్ గుర్తు చేశారు. స్వయంగా ప్రధానిని మా ముఖ్యమంత్రి కలిశారు. హైదరాబాద్ నగరం భారతదేశంలోనే శరవేగంగా విస్తరిస్తున్న నగరం. ఐటీ రంగం ఎదుగుతుంది. ఐటీ ఉద్యోగాల్లో 44 శాతం ఉద్యోగాలు ఒక్క హైదరాబాద్ నుంచే వస్తున్నాయి. మరో వైపు వ్యాక్సిన్ ప్రొడక్షన్‌కు హైదరాబాద్



గ్లోబల్ హబ్‌గా మారింది. ఫార్మా, బయోటెక్ రంగంలో అదే విధంగా ఐటీ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో కూడా అత్యంత కీలకమైన నగరంగా ఎదిగింది. ఏ రకంగా చూసినా ఈ నగరం జాతి నిర్మాణానికి ఉపయోగపడే నగరం కాబట్టి.. మాకు మౌలిక వసతుల కల్పనలో సహాయం అందించండి. స్కైవేల నిర్మాణం కోసం రక్షణ శాఖ భూములు కేటాయించాలని తొమ్మిదేండ్ల నుంచి కోరుతున్నాం అని కేటీఆర్ తెలిపారు.

**రాజ్‌నాథ్ సింగ్‌కు నాలుగు విషయాలు విజ్ఞప్తి చేశాం..**

ఇవాళ ప్రత్యేకంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ప్రత్యేకంగా నాలుగు విషయాలు విజ్ఞప్తి చేయడం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ లాంటి పెరుగుతున్న నగరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అందిన సాయం సున్నా. ఏ సహాయం రాలేదు. 2020 సంవత్సరంలో హైదరాబాద్ నగరం వరదలకు అతలాకుతలమైతే ఒక్క పైసా కూడా సహాయం చేయలేదు. మీరు సహాయం చేయకపోతే చేయక పోయారు కానీ.. కనీసం అభివృద్ధికి ఆటంక పరచకండి. స్కైవేల నిర్మాణానికి ల్యాండ్ ఇస్తే.. మరో ల్యాండ్ ఇస్తామని కూడా చెప్పాం. జేబీఎస్ నుంచి రాజీవ్ రహదారి వరకు స్కైవే నిర్మాణానికి 96 ఎకరాల ల్యాండ్ ఇవ్వమని కోరాం. దానికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమిని కేటాయిస్తామని చెప్పాం. ప్యాట్నీ నుంచి నాగ్‌పూర్ హైవే వరకు 18.5 కిలోమీటర్ల మేర స్కైవే నిర్మించాలని అనుకుంటున్నాం. దాని కోసం 56 ఎకరాలు ఇవ్వాలని కోరాం. దీనికి కూడా ల్యాండ్ ఫర్ ల్యాండ్ ఇస్తామని చెప్పాం. ఈ రెండు స్కైవేలకు డీపీఆర్ కూడా సిద్ధమై ఉంది. కేంద్రం అనుమతిస్తే హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వెంటనే పనులు ప్రారంభిస్తాం అని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో స్కైవాక్స్ కడుతున్నాం. ఉప్పల్‌లో స్కైవాక్ పూర్తయింది. ఈ సోమవారం ప్రారంభించబోతున్నాం. మెహిదీపట్నం రైతుబజార్ వద్ద కూడా స్కైవాక్ కట్టబోతున్నాం. దురదృష్టావశాత్తు అక్కడ కూడా రక్షణ శాఖ భూములు ఉన్నాయి. అక్కడ ఒక అర ఎకరం ల్యాండ్ కావాలి. దానికి కూడా ఇవ్వట్లేదు. ఆ స్థలాన్ని వెంటనే ఇవ్వమని కేంద్ర మంత్రిని కోరడం జరిగింది. హైదరాబాద్ మహానగరంలో కొత్తగా పెద్ద ఎత్తున లింక్ రోడ్డులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. దాదాపు 142 లింక్ రోడ్లను ప్లాన్ చేశాం. అందులో రెండు, మూడు కారిడార్లకు సంబంధించి రక్షణ శాఖ భూములు అడ్డు వస్తున్నాయి. వాటికి కూడా అనుమతివ్వండి అని కేంద్ర మంత్రికి ప్రత్యేకంగా చెప్పడం జరిగింది. వీటన్నింటిని కేంద్ర రక్షణ మంత్రి సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

# పండుటాకుల మోములో బర్త్ డే చిరునవ్వులు..

**వృద్ధాశ్రమంలో ఎస్ఆర్ఆర్ ఫార్చ్యూన్ ఇన్ ఫ్రా ఎండీ పుట్టిన రోజు వేడుకలు**






**హైదరాబాద్, విశాలభారతి :** అతనొక ప్రముఖ డెవలపర్. కానీ నిరాడంబరానికి నిదర్శనంగా, సేవకు నిలువెత్తు రూపంలా ఉంటారు. చేసేది వ్యాపారమే అయినా... సంపాదనలో సమాజ సేవ భాగమేనంటారు. ప్రచార ఆర్భాటాల కంటే తోచిన సాయం చేస్తూ అండగా నిలబడితే కలిగే ఆనందమే వేరు అని మురిసిపోతుంటారు. అలా చిన్న చిన్న సంతోషాలు, వేడుకలను ఆత్మీయతను పంచే వేదికలుగా మార్చడంలో ఘనపాటి. ఆడంబరాలకు తావులేని లేకుండా పండుగ చేసుకుంటూ సంతృప్తి చెందడమే తనకు అలవాటుగా మార్చుకున్న ఎస్ఆర్ఆర్ ఫార్చ్యూన్ ఇన్ ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా మరోసారి పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. నా అనుకునే వాళ్లకు దూరంగా, పండుటాకుల మోమ–ంలో దూరమైన చిరునవ్వులను విరబూయించేలా బర్త్ డే సెలబ్రేషన్ చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, కంపెనీ సిబ్బందితో కలిసి కూకట్ పల్లిలోని రాజేశ్వరి వృద్ధాశ్రమానికి చేరుకుని సరదాగా గడిపారు. వారికి అప్యాయంగా అన్నం వడ్డించి సంబరపడిపోయారు. పండ్లు, నగదు, నిత్యావసర సరుకులను అందజేసి అండగా నిలిచారు. ఏటా జరిగే పుట్టిన రోజు వేడుకలను ఇదే తీరుగా నిర్వహించుకోవడమే తనకు ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు.




# కేంద్రం కొత్త విద్యుత్ రూల్స్.. పగటి పూట తక్కువ, రాత్రి పూట ఎక్కువగా విద్యుత్ ఛార్జీలు



**న్యూఢిల్లీ:** త్వరలో కొత్త విద్యుత్ ఛార్జీలు అమలులోకి రానున్నాయి. దీని ప్రకారం పగటిపూట విద్యుత్ ఛార్జీలు 20 శాతం వరకు తగ్గనున్నాయి. అయితే రాత్రిపూట పీక్ వేళల్లో విద్యుత్ ఛార్జీలను 20 శాతం మేర పెంచనున్నారు. దీనికి సంబంధించిన కొత్త విద్యుత్ నియమాలను కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ కొత్త వ్యవస్థను అమలు చేయడం వల్ల పీక్ సమయాల్లో గ్రిడ్‌పై భారంతోపాటు విద్యుత్ డిమాండ్ తగ్గుతుందని పేర్కొంది. 2024 ఏప్రిల్ నుంచి తొలుత వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు ఈ విధానం అమలులోకి వస్తుందని తెలిపింది. ఏడాది తర్వాత వ్యవసాయ రంగం మినహా, మిగతా అన్ని రంగాల విద్యుత్ వినియోగదారులకు ఈ రూల్‌ను వర్తింపజేయనున్నట్లు వెల్లడించింది.

కాగా, సౌర విద్యుత్తు చౌకని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయ్యే పగటి సమయాల్లో విద్యుత్ ఛార్జీలు తక్కువగా ఉంటాయని, తద్వారా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. సౌర శక్తి అందుబాటులో లేని రాత్రి సమయాల్లో థర్మల్, హైడ్రో, గ్యాస్ ఆధారిత ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తి కంటే వాటి ఖర్చులు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రాత్రి వేళ విద్యుత్ ఛార్జీలను ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు. 2030 నాటికి శిలజాయేతర ఇంధనాల శక్తి సామర్థ్యాన్ని 65 శాతం చేరేందుకు ఈ విధానం సహాయ పడుతుందని కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. అలాగే 2070 నాటికి సున్నా ఉద్గారాల లక్ష్యానికి అనుగుణంగా ఈ దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

కాగా, కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఈ విధానం వల్ల సోలర్ విద్యుత్ వ్యవస్థ ఉన్న వినియోగదారులకు మేలు జరుగనున్నది. అలాగే పగటి పూట వినియోగించే విద్యుత్‌కు తక్కువ ఛార్జీలు, రాత్రి వేళ వినియోగించే లైట్లు, ఫ్యానులు, ఏసీలు వంటి వాటికి ఎక్కువ విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.



# ఆసియా గేమ్స్ ట్రయల్స్..

## ఆ ఆరుగురు రెజ్లర్లు ఒక్క బౌట్ ఆడితే చాలు

భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని ఉద్యమించిన రెజ్లర్లకు ఊరట లభించింది. ఆసియా గేమ్స్ ట్రయల్స్ నుంచి వినేశ్ ఫోగట్, భజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్, సంగీత ఫోగట్, సత్యవర్త్ కడియన్, జితేందర్ కిన్హాలకు ఒలింపిక్ సంఘం అడ్ హక్ కమిటీ మినహాయింపు ఇచ్చింది. ఆగస్టులో నిర్వహించనున్న ఒకే ఒక బౌట్‌లో పోటీ పడేందుకు వీళ్లకు అనుమతించింది. దాంతో, ఆయా విభాగాల్లోని ట్రయల్స్ విజేతలతో ఈ ఆరుగురు పోటీ పడనున్నారు. ఈ విషయాన్ని రెజ్లర్లకు ఏఓఏ తెలియజేసింది. ఫోగట్, భజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్, సంగీత ఫోగట్, సత్యవర్త్ కడియన్, జితేందర్ కిన్హాలకు వారి వారి విభాగాల్లో ట్రయల్స్‌ను ఆగస్టు 5 నుంచి 15 వరకు జరగనున్నాయి. ఆసియా గేమ్స్ ట్రయల్స్ విజేతలతో వీళ్లు పోటీ పడాల్సి ఉంటుంది. ఇంతకుముందు వరల్డ్ చాంపియన్‌షిప్స్, ఒలింపిక్ క్వాలిఫికేషన్ కోసం ట్రయల్స్ జరిగినా కూడా మళ్లీ నిర్వహిస్తాం' అని రెజ్లర్లకు పంపిన లెటర్‌లో అడ్ హక్ కమిటీ అధ్యక్షుడు భూపేందర్ సింగ్ బజ్వా తెలిపాడు.

### ఎఫ్ ఐఆర్ నమోదు చేయడంతో..

ఈ నెల ప్రారంభంలో వినేశ్ ఫోగట్, భజ్‌రంగ్ పూనియా బృందం క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను కలిశారు. ఆందోళన కారణంగా తమకు ప్రాక్టీస్ చేసేందుకు సమయం లేదని, ఆగస్టులో నిర్వహించే ఆసియా గేమ్స్ ట్రయల్స్‌లో ఆడేందుకు తమను అనుమతించాలని కోరారు. దాంతో, రెజ్లర్ల పేర్ల నమోదు తేదీని జూలై 15 నుంచి ఆగస్టు 15 వరకు పొడిగించాలని ఆసియా ఒలింపిక్ కౌన్సిల్‌ను మంత్రి అభ్యర్థించారు. ఈ ఆరుగురు రెజ్లర్లలో భజ్‌రంగ్, వినేశ్ మాత్రమే ఆసియా గేమ్స్‌లో పతకాలు సాధించారు. ప్రస్తుతం వీళ్లు డిఫెండింగ్ చాంపియన్లుగా బరిలోకి దిగనున్నారు. మైనర్ అమ్మాయిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు ఆందోళనకు దిగారు. ఎట్టకేలకు పోలీసులు అతడిపై ఎఫ్ ఐఆర్ నమోదు చేయడంతో తమ పోరాటానికి కాసేపు విరామం ఇచ్చారు. సాక్షి మాలిక్, భజ్‌రంగ్ తమ రైల్వే ఉద్యోగ విధుల్లో చేరారు.

# రోజురోజుకీ బలపడుతున్న కాంగ్రెస్..

- ఇటీవల కాంగ్రెస్ లో చేరిన మాజీ ఎమ్మెల్సీ అరికెల.
- బిజెపి పార్టీలో అంతర్గత పోరు?
- జిల్లాలో ఏ పార్టీకి జై కొడతారో?



**నిజామాబాద్ బ్యూరో-విశాల భారతి.** నిజామాబాద్ జిల్లాలో రోజురోజుకీ కాంగ్రెస్ పార్టీ బలపడుతుంది. నిన్నటికి నిన్న టిడిపి అభ్యర్థి అరికెల నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రెడ్డి సామాజిక వర్గం చెందిన నర్సిరెడ్డి గతంలో ప్రజల మనిషిగా మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకున్నారు . ఈ నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులకు నూతన ఉత్సాహంతో పాటు బూస్ట్ ఇచ్చినట్టు అయింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామనే ఆశలు రోజురోజుకు పెరుగుతున్నాయి అనుకోవచ్చు. ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు పట్టించుకోకపో వడం వల్ల ఇద్దరూ టిఆర్ఎస్ నేతలు పార్టీకి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఖమ్మం జిల్లా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణ రావు ఇద్దరూ టిఆర్ఎస్ పార్టీని విడనాడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించడం అందరికీ తెలిసిన విషయమే. దీంతో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో రాజకీయపరంగా టిఆర్ఎస్ పార్టీతో పోటీపడి గెలుపొందాతామని ఆశలు చిగురించాయి. దీంతోపాటు వైయస్ షర్మిల పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి వైయస్సార్సీపి అధినేత్రి షర్మిలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కట్ట పెట్టడానికి కాంగ్రెస్ అధిష్టానం ముగ్గు చూపుతుంది. టిఆర్ఎస్ చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి రంగాల్లో జరుగుతున్న అవినీతిని ప్రజల్లోకి బలంగా వెళ్లడానికి కాంగ్రెస్ పార్టీ నేతలు గట్టిగానే పనిచేస్తున్నారు. దీంతో టిఆర్ఎస్ బిజెపి పార్టీలో కొంతమేరకు అసహనం నెలకొందని వినికిడి. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన అరికెల నర్సారెడ్డికి జిల్లాలో మంచి పేరు పరీక్షలు ఉన్నాయి. అంతేకాకుండా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కనక అధికార పార్టీ నేతలకు బలంగా పోటీ ఇచ్చే వ్యక్తిగా, టిఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పిదాలను ఎక్కడికక్కడ ఎండగట్టే రీతిలో అరికెల నర్సిరెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. కెసిఆర్ ను ఓడించడానికి నాలుగు మెట్లు కిందికి దిగుతానని సవాల్ విసిరి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పడం కాంగ్రెస్ శ్రేణులో ఉత్సాహంతో పాటు అధికార పార్టీని ఎదుర్కోవచ్చని కాంగ్రెస్ పార్టీ నాయకులో ధైర్యం కూడా వచ్చింది. గతంలో కాంగ్రెస్ పార్టీలో కూడా అంతర్గత పోరు ఒకరిపై ఒకరు అలకలు చూశాం. కానీ రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేతలను బుజ్జగింపు చర్యలు చేపట్టి, ఎన్ని రోజులని మనలో మనం అంతర్గత కుమ్ములాటలు ఎందుకని? అదేదో ప్రతీకారం అధికార పార్టీపై తీసుకుందామని కంకణం కట్టుకుని మరి తెలంగాణ మలిదశ ఉద్యమంలో అన్యాయం జరిగిన నేతలందరూ ఒక్కతాటిపైకి వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరి అధికారమే లక్ష్యంగా పోరాడు తున్నారు. ఇదిలా ఉండగా నిజామాబాద్ జిల్లాలో బిజెపి పార్టీలో గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే ఎంపీ స్థానాలు ఉన్న ప్పటికిని అభ్యర్థులు సరైన వారు లేరు. ఇది బిజెపి పార్టీకి పెద్ద మైనస్ అనుకోవచ్చు. ఏ రాష్ట్రంలోనైనా అధికార పార్టీ బలంగా ఉంటుంది. దానిని ఢీకొట్టాలంటే ప్రత్యర్థి, ప్రత్యామ్నాయ పార్టీ కూడా బలంగా ఉండాలి, అందులో ఉన్న నాయకులు కూడా తెలివైన నాయకులు కావాలి. అందుకే కాంగ్రెస్ పార్టీలో రోజు రోజుకి చేరికలు పెరిగిపోతున్నాయి. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ పగ్గాలు చెప్పడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెపుతున్న, ఒకవైపు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న అభ్యర్థులు, వారు అవలంబిస్తున్న తీరును బట్టి చూస్తే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం అధికారం చేపట్టడం పెద్ద విషయం కాదని చెప్పుకొస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కూడా సామాన్య ప్రజలకు, నిరుపేదలకు, అన్ని రకాల ప్రజలకు సామాజిక న్యాయం అందించే విధంగా రూపొందిస్తా మని రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గతంలోనే తెలిపారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఇది జగ మెరిగిన సత్యం. ప్యాడిపర్చేస్ కేంద్రాలు గాని, పాఠశాలలో నూతన విద్యా విధానం, ఆరోగ్యశ్రీ, నిరుపేదలకు పక్కా ఇల్లు వంటి సంక్షేమ పథకాలు వందకు వందశాతం అమలయ్యాయి. కానీ తెలంగాణ రాష్ట్రం ముఖ్యంగా నీళ్లు, నిధులు, నియామకాలపై, రాష్ట్ర ఏర్పడింది. ప్రాజెక్టులు నిర్మించడమే తప్ప సాగునీరు ఎక్కడ పారింది లేదు. నియామకాలు చేపట్టింది లేదు. నిధులు విడుదల చేస్తున్న కమిషన్ల రూపంలో మళ్లీ అధికార పార్టీ నాయకులకే వెళ్తున్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. నిజామాబాద్ జిల్లా ప్రజలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకి ముగ్గు చూపుతారో అనే విషయం ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే.



## అవినీతి రహిత పాలన ప్రధాని నరేంద్ర మోడీది..

**తార్నాక- విశాలభారతి :** కేంద్రంలో 9 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన ప్రజలకు అందించారని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి చుక్క గణేష్ ముదిరాజ్ అన్నారు.కానీప్రత్యేక రాష్ట్రంలో అవినీతి కుటుంబ పాలన నడుస్తుందని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం లాలా పెట్ లోని పోలింగ్ బూత్ 96/97 లో రాష్ట్ర బిజెపి పిలుపు మేరకు మహా జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులు, విజయాలు పథకాల బ్రోచర్స్ ద్వారా ప్రజలకు గణేష్ ముదిరాజ్ వివరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నేతృత్వంలో సంక్షేమ పథకాలు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని తెలిపారు. ప్రపంచ దేశాలు సైతం భారతదేశం వైపు చూసే విధంగా చేశారని కొనియాడారు. ప్రపంచంలో అత్యంత వేగంగా ఇండియా అభివృద్ధి చెందుతున్న ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని తెలిపారు. దేశ ప్రజలకు డిజిటల్ లావాదేవీలను పరిచయం చేసిందని దీనితో వ్యవస్థ అంతా సవ్యంగా జరుగుతుందని చెప్పారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా 12 కోట్ల మంది రైతులకు ఆర్థిక సహాయం చేస్తున్నారని వివరించారు. ఇంత చేస్తున్న ఎక్కడ కూడా అవినీతికి తావు లేకుండా పాలన కొనసాగిస్తున్నారని, కానీ రాష్ట్రంలో ఏర్పడ్డ టిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి పాలనలో ముందుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు అవినీతి రహిత పాలన కావాలని కోరుకుంటున్నారని, డబుల్ ఇంజన్ సర్కార్ తోనే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకటేష్ గౌడ్, ప్రమోద్, పోచయ్య యాదవ్, ద్రాక్షారం అనిత, రాము, శ్రీనివాస్ చారి, బిక్షపతి, అనూష తదితరులు పాల్గొన్నారు..

## జూనియర్ న్యాయవాదులకు 20 వేల స్కాలర్షిప్ ఇవ్వాలి




**హైదరాబాద్ - విశాలభారతి :** న్యాయవృత్తిలో భాగంగా జూనియర్ న్యాయవాదులకు నెలకు 20వేల స్కాలర్షిప్ ను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ట్రస్టర్ అడ్వకేట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యానగర్లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో న్యాయవాదులు వృత్తిపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని

41 (ఎ) సి ఆర్ పి సి ని (స్టేషన్ బెయిల్) వెంటనే రద్దు చేయాలని కోరారు. న్యాయవాదులపై రాజకీయ నాయకుల ఒత్తిడి బెదిరింపులను అరికట్టి, న్యాయవాదుల రక్షణకే ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అడ్వకేట్స్ పై దాడి చేసిన నిందితులపై నాన్ బెయిలెబుల్ కేసులు నమోదు చేయాలని కోరారు. న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్ రెండు లక్షల నుండి 5 లక్షల వరకు పెంచి న్యాయ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో తల్లీకూతుళ్ల అనుమానాస్పద మృతి

**శేరిలింగంపల్లి - విశాలభారతి :** తల్లీ కూతుళ్లు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికొండ ఆంధ్రా బ్యాంక్ సమీపంలో నివాసం ఉంటున్న సదానందంకు భార్యా ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్దిరోజులుగా వీరి కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో బుద్దోలు అలివేలు(40) గురువారం తన భర్త(సదానంద)కు వ్యక్తిగత అవసరాల కోసం రూ.5 వేలు ఇచ్చి యాదగిరిగుట్టను సందర్శించి రమ్మని చెప్పింది. అనంతరం ఇంట్లోని పాతబట్టలను కాల్చివేసింది. కుమారుడు మణికంఠ ప్రశ్నించగా నీకేం తెలియదు ఇక్కడి నుండి వెల్లమంటూ గద్దించడంతో ఆ బాలుడు అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అనంతరం రాత్రి 9 గంటలకు నిద్రించిన వారు అర్ధరాత్రి 2.45 గంటలకు తన కుమార్తె లాస్య (14)కు బెడ్ రూములో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసింది. కూతురు చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత తాను వంటగదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.మధ్యరాత్రి మెలుకువ వచ్చి లేచిన మణికంఠకు అతని అక్క, అమ్మ ఉరివేసుకుని ఉండటాన్ని చూసి 100కి ఫోన్ చేశాడు. రాయదుర్గం పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆసక్తికర విషయమేంటంటే కూతురు చేతిపై గోరింటాకుతో గేమ్ ఈజ్ స్టార్టెడ్, డూ సంథింగ్ దట్ మేక్ హ్యాపీ అని రాసి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## గొప్ప దేశభక్తుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ పల్లపు బుద్ధుడు



**చిట్యాల విశాలభారతి** చిట్యాల మండలం ఊరుమడ్ల గ్రామంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమం సందర్భంగా ఆ మహనీయునికి ఘనమైన నివాళులు అర్పిస్తూ తన చిత్రపటానికి భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపు బుద్ధుడు పూల మాలవేసి తులసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా పల్లపు బుద్ధుడు మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన జన సంఘ్ వ్యవస్థాపకులు గొప్ప దేశభక్తుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఖండిత భారతపు అఖండత్వం కోసం బలిదానం చేసిన మొట్టమొదటి దేశభక్తుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ పుణ్యతిధి నేడు అని అన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ భారతమాత కన్న మహా సంతానంలో ఒకరు వారి జీవితంలో ప్రతిక్షణం శరీరంలో ప్రతి కణం మాతృభూమి సేవకే సమర్పితం అయ్యాయని అన్నారు. గాఢాంధకార భవిష్యత్తులో మునిగి ఉన్న భారత ప్రజానీకానికి భారతీయ జన సంఘం ద్వారా నూతన దిశను ప్రారంభించారు. భౌతిక సుఖాలే లక్ష్యంగా మనుషులను యంత్రాలుగా మార్చి పని చేయించే విధానాల ద్వారా ఏ జాతి గొప్పదనాన్ని సాధించలేదు. పాశ్చాత్యుల నైపుణ్యం విజ్ఞానం నుండి శక్తిని సంపాదించుకునే విధంగా మన సంస్కృతి నాగరికతలతో విద్యా విధానాన్ని అనుసంధానం చేయడమే మన ఆదర్శం కావాలి అని స్వర్గీయ డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ అన్నారన్నారు. కాశ్మీర్ గురించి ఎన్నో పోరాటాలు చేశారు అని అన్నారు. మాతృభూమి సేవలో నిజమైన యోధుడిగా శ్యామ ప్రసాద్ కాశ్మీర్ విలీనం కోసం సాగిన పోరాటంలో అగ్ర భాగాన నిలిచి బలిదానం చేశారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఏ లక్ష్యం కోసం అయితే బలిదానం అయ్యారో దానిని భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వం 370వ అధికరణను తొలగించి వారికి ఘనమైన నివాళి అర్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నకిరేకల్ అసెంబ్లీ కన్వీనర్ కోరబోయిన లింగస్వామి, మీడియా సెల్ కన్వీనర్ ఉయ్యాల లింగ స్వామి గౌడ్, చిట్యాల మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు పొలిమేర రామ్ కుమార్, బూత్ కమిటీ అధ్యక్షులు ఈదుల పవన్, చింతకాయల రాము, మల్లేష్ యాదయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**దేశంలో ద్వంద్వ నీతికి చెక్ పెట్టిన మహనీయుడు**



**శేరిలింగంపల్లి- విశాలభారతి :**

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆత్మబలిదాన్ దివాస్ సందర్భంగా కొండాపూర్ లోని మసీదు బండ కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు మాజీ శాసన సభ్యులు బిక్షపతి యాదవ్.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అఖండ భారతావనిలో ఒకే జెండా,ఒకే రాజ్యాంగం, ల్ఒకే నినాదం ఉండాలని గట్టిగా చెప్పిన గొప్ప మహనీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని తెలియజేశారు, జాతీయ సమగ్రత, దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీసే నాటి నెహ్రూ విధానాలను తీవ్రంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రత్యేక సంస్థానంగా ఉన్న జమ్మూ కాశ్మీర్ వెళ్లాలంటే నాడు పర్మిషన్, 370 ఆర్టికల్ విధానాన్ని వ్యతిరేకించి రద్దు అయ్యేందుకు పోరాడి అక్కడే శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆత్మబలిదానమైయ్యారని గుర్తు చేశారు. ఆయన ప్రాణత్యాగం వృధాకాకుండా దేశ ప్రజల అభిష్టం మేరకు ప్రధాని నరేంద్రమోడీ గారు 370 ఆర్టికల్ రద్దు చేశారని కొనియాడారు. దేశం మొత్తం ఒక్కటే భారత రాజ్యాంగం అమలు చేస్తున్న ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో మాదాపూర్ కాంటెస్టడ్ కార్పొరేటర్ రాధాకృష్ణ యాదవ్ , లింగంపల్లి కాంటెస్టడ్ కార్పొరేటర్ కంచర్ల ఎల్లేశ్ , కొండాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ ఆంజనేయులు సాగర్, రమేష్ , వినోద్ రావు , సదానంద యాదవ్ , శ్రీశైలం యాదవ్ , శివ ,గోవర్ధన్ నాయక్ , తదితరులు పాల్గొన్నారు.



## బాల సాహిత్యమే మనోవికాసానికి మూలం

**చిట్యాల విశాలభారతి** బాల సాహిత్యం విద్యార్థుల మేధో వికాసానికి దోహద మవుతుందని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అన్నారు. చిట్యాల మండలం లోని వట్టిమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్య రచించిన వెన్నెల కుప్పలు పిల్లల పాటల పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దోకూరి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల పదవ తరగతి విద్యార్థిని వెన్నపూసల భవ్య వెన్నెల కుప్పలు గ్రంథాన్ని ఆవిష్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి రచయిత సాగర్ల సత్తయ్య పుస్తకాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రచయిత పెరుమాళ్ళ ఆనంద్, పొట్ట బత్తుల రామకృష్ణ, ఎన్ యాదయ్య, డి సూర్య ప్రకాష్ ఎం నీరజ, బిఆర్ రాజు, శీలం మధుసూదన్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## హమీద్ పటేల్ కు జన్మదిన శుభాకాంక్షలు



**శేరిలింగంపల్లి- విశాలభారతి** కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ జన్మదినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన నివాసానికి వెళ్లి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ హమీద్ పటేల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాపూర్ డివిజన్ కోసం అహర్నిశలు కృషి చేస్తూ నిత్యం ప్రజలలో ఉంటూ స్థానికుల అభిమానం పొందుతూ రాజకీయంగా అంచలంచగా ఎదిగారని అన్నారు. ఆయన భవిష్యత్తులో మంచి పదవులు అలంకరించి మరింత విస్తృతంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించాలని బండి రమేష్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సాయి, నరసింగరావు, సంగారెడ్డి, బాలరాజు, ముదిరాజ్, శేఖర్ గౌడ్,అమ్ము, సత్య రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న సిసి రోడ్డు



**అనంతగిరి - విశాలభారతి :** మండల పరిధిలోని పాలవరం గ్రామ మొదటి వార్డు మెయిన్ సీసీ రోడ్ రహదారి శుక్రవారం రాత్రి వర్షంతో రోడ్డుపై నీరు నిలిచి చెరువును తలపించే విధంగా మారింది. ఈ రోడ్డు గుండా ఎక్కువగా , రైతులు, విద్యార్థుల తిరుగుతుంటారు. పక్కన ఖమ్మం జిల్లా యొక్క గ్రామాలకు వెళ్లేందుకు కూడా ఈ దారి ప్రధానంగా నిలిచింది. గ్రామానికి సంబంధించిన కుటుంబాల వారు అందరూ ఈ రోడ్డు ద్వారా ప్రయాణిస్తారు. చెరువును తలపించే విధంగా ఉన్న ఈ రోడ్డు పై ప్రయాణం అంటేనే భయపడుతున్నట్టు అవార్డు ప్రజలు వాపోతున్నారు. రోడ్డుపై మోకాళ్ళ లోతు వర్షపు నీరు నిలువ ఉండడంతో రోడ్డు పైభాగంలో ఎర్రటి బురద పేరుకుపోయి బాటసారులు వాహనాలు జారి పడి ప్రమాదాలు జరుగే ప్రమాదం కూడా ఉందని వారు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టవలసిందిగా తమ గోడును తెలిపినా రోడ్డుకు మోక్షం కలగడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు కల్పిం చుకుని ఈ రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుచున్నారు. సంబంధిత ఈ రోడ్డు సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని చర్యలు చేపట్టాలని వారు కోరారు. వెంటనే ప్రభుత్వం ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి ఈ రోడ్డు కు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించి వర్షపు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు



## కేంద్రం ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికి బిజెపి

**చిట్యాల విశాలభారతి** కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ 9 సంవత్సరాల కాలంలో సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం వైపు అడుగులు వేస్తూ భారత దేశ అభివృద్ధికి అహర్నిశలు పాటు పడుతున్నారని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపు బుద్ధుడు అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపు బుద్ధుడు వాడ వాడల ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోడీ విజయాలను తెలియపరుస్తూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి గాను 9090902024 నెంబర్ కు మిస్డ్ కాల్ ఇవ్వండి ప్రధానమంత్రి కి మద్దతు తెలుపండి అని ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పాలనలో ప్రవేశపెట్టిన అన్ని పథకాల గూర్చి ఇంటింటికీ బిజెపి ప్రచారంలో భాగంగా వివరించారు. కేంద్ర ప్రభుత్వం పలు పథకాల కింద దేశంలోని రాష్ట్రాలకి అందిస్తున్న నిధులను గూర్చి వివరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నకిరేకల్ ఎస్సీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ కోరబోయిన లింగస్వామి, మీడియా సెల్ కన్వీనర్ ఉయ్యాల లింగస్వామి గౌడ్, ఎస్సీ మోర్చా చిట్యాల మండల అధ్యక్షులు పొలిమేర రామ్ కుమార్, బూత్ కమిటీ అధ్యక్షులు ఈదుల పవన్, యాదయ్య, శ్రీను, మల్లేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు

## దశాబ్ది ఉత్సవాల పేరుతో లక్షల రూపాయల ఖర్చు.

**టిఆర్ఎస్ పార్టీ పై మండిపడ్డ మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి.**



**నిజామాబాద్ బ్యూరో- విశాల భారతి :** దశాబ్ది ఉత్సవాల పేరుతో ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేశారని మాజీ ఎమ్మెల్సీ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ భూపతి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ. దశాబ్ది ఉత్సవాలో అన్ని పార్టీలు కలిసి జరుపుకున్నప్పుడే అవి ఉత్సవాలు అవుతాయని, కానీ అవి కేవలం టిఆర్ఎస్ పార్టీ నేతలు జరుపుకు న్న దశాబ్ది ఉత్సవాలను ఉద్యోగ చేశారు. ఎందరో అమరుల త్యాగాలు ఫలితంగా, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, విధులు నీళ్లు నియామకాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం కెసిఆర్ ఒక్కడే చావు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ రాష్ట్రం చిదించినట్లు జబ్బులు చరుచుకుంటూ చెబుతున్నాడని పేర్కొన్నారు. 1200 మంది అమరవీరులు త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ తెలంగాణ. కేవలం 600 మంది అమరవీరులతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది అనడం ఎంత సిగ్గుచేటని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎందరో తమ ఉద్యోగాలను వదులుకొని సైతం పోరాటంలో పాల్గొన్నారని కానీ వారికి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ప్రాముఖ్యత ఇవ్వకుండా డబ్బున్న వారిని ఇతరులను అక్కున చేర్చుకుంటున్నారని తెలిపారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలంటే, అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని వివరించారు. నిజామాబాద్ జిల్లా ఉన్న ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుల పనిచేసి గడపగడపకు కాంగ్రెస్ పార్టీ రానున్న రోజుల్లో చేపట్టే విధివిధానాలను, ప్రజల కోసం చేపట్టే సంక్షేమ పథకాలను వివరించాలని కాంగ్రెస్ నాయకులకు పేర్కొన్నారు. అనంతరం దశాబ్ది ఉత్సవాలను నిరసిస్తూ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి సిరికొండ మండల చౌరస్తా వద్ద కెసిఆర్ దిష్టి బొమ్మను దానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ అద్దున్, నగేష్ రెడ్డి, అమృతపూర్ గంగాధర్, జిల్లాస్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముదిరాజులను బిసి ఏ గ్రూపులో చేర్చాలె.



**ముషీరాబాద్ - విశాలభారతి:** ముదిరాజులను బిసిడి నుండి బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ కోకన్వీనర్ పగడాల సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యానగర్లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. బీసీ బందు, లక్ష రూపాయల స్కీమును ముదిరాజ్ అందరికి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. నేటి కూడా ముదిరాజులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని వారిని ఆదుకోవాల్సిన అవసరం పై ఉందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బీసీ బందు పథకం ప్రవేశపెట్టి ప్రతి ముదిరాజ్ కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.




## అక్రమ మట్టి రవాణా నిలిపివేయాలని వినతి

**అనంతగిరి- విశాలభారతి :** ప్రభుత్వ భూమి నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న చర్యలను నిలిపివేయాలంటూ మండల పరిధిలోని కానాపురం గ్రామానికి చెందిన మర్రి వీరబాబు అనే వ్యక్తి శుక్రవారం స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. గత 15 రోజుల క్రితం అనంతగిరి పరిధిలోని 778 సర్వేనెంబర్ గల భూమిని ప్రభుత్వం చేపట్టిన హరిత హార కార్యక్రమానికి అట్టి భూమి నీ సేకరించి కానాపురం గ్రామపంచాయతీకి అప్పగించారని కానీ కొందరు అప్పగించిన ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని చదును చేయకుండా అట్టు భూమిలో అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతూ ఇతర ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు కలగజేసుకొని ప్రభుత్వ భూమిలో గుంతలు చేసి దుర్వినియోగపరిచేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై చర్యలు తీసుకొని అట్టి భూమిని హరితహార కార్యక్రమానికి ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని వారు తెలిపారు.

## ఇందూరు నుంచి

# మూడు ఎమ్మెల్సీలు గాయాబ్....?

- పూర్వవైభవం ఘనం.. ప్రస్తుతం పదవుల లేక డీలా...
- రెండు ఎమ్మెల్యే కోటా, ఒకటి గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను మిస్ అవుతున్న జిల్లా...
- రాజకీయంగా ఇది బీఆరెస్‌కు భారీ లోపమే..? జిల్లాను ఎందుకు పట్టించుకోవడం లేదు....
- కవిత ఓటమి తర్వాత సీఎంకు జిల్లాపై ఇంట్రస్ట్ తగ్గిందా..?



**నిజామాబాద్ బ్యూరో- విశాల భారతి :** ప్రతిపక్షాలు బలోపేతమవుతున్న తరుణంలో ... పదవుల పంపకాల్లో మరింత దూకుడు పెంచాల్సిందే...అసంతృప్తులు పెరుగుతున్నారు. ఆశావహులు ఎదురుచూపులతో విసిగి పోయారు. ఎన్నికల ముంచుకొస్తున్న తరుణంలో జిల్లాలో విచిత్ర పరిస్థితి...

ఇందూరు జిల్లా బీఆరెస్‌కు కంచుకోట. అన్ని స్థానాలు గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసి రాష్ట్ర రాజకీయాల్లోనే జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టుకున్నది. సీఎం కూతురు కవితే జిల్లాలో పెద్ద దిక్కుగా ఉన్న నేపథ్యంలో ఇక్కడి ప్రజలకు ఎంతో నమ్మకం, విశ్వాసం. ఏదో భరోసా. మన జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని. అందుకే ఆమె ప్రభావం, ప్రమేయం జిల్లాలో పార్టీ బలోపేతానికి ఇతోధికంగా ఉపయోగపడిందని చెప్పడంలో అతిశయోక్తి కాదు. కానీ, రాను రాను పరిస్థితి తారుమార వుతోంది. ఎంపీగా కవిత ఓడిపోవడం జిల్లాకు శాపంగా మారింది. సీఎం కేసీఆర్‌కు జిల్లా అంటే మొదటి నుంచి ప్రత్యేక అభిమానం. ఇక్కడి రైతులు, వ్యవసాయం ఆయనకు ఇష్టం.

ఇప్పటికే అంకాపూర్ రైతుల గురించి తలుచుకుంటూ ఉంటారు. ఇక్కడి ఉద్యమ స్ఫూర్తిని నెమరువేసుకుంటూ ఉంటారు. తొలిసారి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కట్టబెట్టి పార్టీకి, ఉద్యమానికి ఊపిరి పోసిన జిల్లాగా ఆయన గతాన్ని నెమరువేసుకుంటూ ఉంటారు. కానీ ఎప్పుడైతే కవిత ఓడిపో యిందో.. అప్పటి నుంచి ఆయన జిల్లాపై పెద్దగా ఇంట్రస్ట్ చూపడం లేదనిపిస్తుంది. పెద్దగా పట్టించు కోవడం లేదనే ఆవేదనా ఆ పార్టీ నేతల్లో ఉంది. దీనికి తాజా ఉదాహరణగా ఎమ్మెల్సీలను జిల్లా కోల్పోవడమే. గతమెంతో ఘనం. కానీ ఇప్పుడు జిల్లాకు చెందిన మూడు ఎమ్మెల్సీ స్థానాలను కోల్పోయే పరిస్థితి వచ్చింది.రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు... ఒకరు ఆకుల లలిత, మరొకరు వీజీ గౌడ్, తాజాగా గవర్నర్ కోటా రాజేశ్వర్ పదవీకా లం ముగిసిపోయింది. ఆకుల లలితకు మళ్లీ ఎమ్మెల్సీని రెన్యూవల్ చేస్తామన్నారు. చేయలేదు. లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఇస్తామన్నారు. చివరి నిమిషంలో అది కవితకు కేటాయించారు. ఆమెకు ఉమెన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరీ ఇచ్చారు. పెద్దగా సంతృప్తి లేదు ఆ పదవితో వారికి. ఇక వీజీ గౌడ్‌కు కూడా హామీ ఇచ్చారు. ఈ గవర్నర్ కోటాలో తనకు ఛాన్స్ వస్తుందని ఆశించారు. కానీ ఆ పరిస్థితులు కనిపించడం లేదు. గవర్నర్ కోటాలో నాకు వస్తుందంటే నాకు వస్తుందని చాలా మందే ఆశలు పెట్టుకున్నారు. కానీ సీఎంకు మాత్రం జిల్లాకు ఎమ్మెల్సీ పేరును ప్రతిపాదించే ఆలోచనే ఉన్నట్టు లేదు. ఇక్కడ ప్రతినిధ్యం వహిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత కూడా జిల్లాకు ఈసారి కచ్చితంగా ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని ఇవ్వాలి అని సీఎం కేసీఆర్‌ను కోరే పరిస్థితులూ అక్కడ లేవు. దీంతో బాస్ మదిలో ఏముంటే అది. ఎవరికివ్వాలో చివరి నిమిషం వరకు ఆయనకు తప్ప మరొకరి తెలిసే ఛాన్స్ లేదు. జిల్లాకు ఇస్తారన్న ఆశా లేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్త పదవులు ఏమైనా వస్తాయని క్యూలో చాలా మందే ఆశావ హులున్నారు. కనీసం పార్టీ పదవులన్నా ఇవ్వకపోతారా అని ఎదురుచూస్తున్నారు. అవేమీ లేకపోగా ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు మంగళం పాడేయడం కూడా జిల్లా పార్టీలో నాయకులకు తీవ్ర నిరాశ, నిస్పృహలనే మిగల్చనుంది. సామాజికవర్గాల వారీగా చూసినా ఇద్దరు బీసీలు, ఒక ఎస్సీ తమ ఎమ్మెల్సీలను కోల్పోయారు.



## తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం ఖాయం..

**హైదరాబాద్ విశాల భారతి:** తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందని కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. సుపరిపాలన, మత సామరస్యం రాలవాలంటే టీడీపీ ప్రభుత్వం మళ్ళీ రావాలని ప్రజలు కోరుకుంటుంన్నారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో వివిధ పార్టీలకు చెందిన నాయకుల చేరిక సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ..ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు అన్నివర్గాలకు తగిన ప్రాధాన్యత ,గౌరవం, దక్కిందన్నారు. సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన మహనుబావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. బడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ టిడిపి అని గుర్తుచేశారు. పథకాలు, వృద్యప్య పింఛన్,మహిళ కు అస్తి హక్కు,ఆహార భద్రత, 2 రూపాయలకు కిలో బియ్యం ఇచ్చిన ఘనత కేవలం తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు.జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తెచ్చిన ఐటీ, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగురోడ్డు ..లాంటి అభివృద్ధి పనులు చేసిన గొప్ప నేత విజన్ 2020 తో అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. నాటి అభివృద్ధి నేటి తెలంగాణ లో టిడిపి కి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. అందుకే వివిధ పార్టీలకు చెందిన నాయకులు తెలుగుదేశంలో చేరుతున్నారని ఇంకా ఎంతో మంది ఈ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.ఈ క్రమంలోనే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుజురాబాద్, ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన రిటైర్డ్ పంచాయితీ రాజ్ ఈఈ కొండ్రా కుమార్, హుజురాబాద్ కు చెందిన బీఆర్ ఎస్, బీజేపీ నాయకులు అయితే హరీష్, ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేరడం జరిగిందన్నారు.

### డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా.

**నిజామాబాద్ బ్యూరో- విశాలభారతి :** నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ 2వ,4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్ మరియు 1వ, 3వ,5వ సెమిస్టర్ బ్యాక్లాగ్ థియరీ పరీక్షలు జూన్ 30వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా TS CPGET2023 ప్రవేశ పరీక్ష దృశ్య వాయిదా వేసామని తిరిగి ఈ పరీక్షలు జులై 11వ తేది నుంచి ప్రారంభమవుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ. అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సంబంధిత విద్యార్థులు ఈ విషయం గమనించాలని సూచించారు. పూర్తి వివరాలకుwww. Telanganauniversity.ac.in వెబ్ సైట్ సంప్రదించాలని కోరారు.

## కేసీఆర్ కనుసన్నల్లోనే నకిలీ యూనివర్సిటీలకు అనుమతులు

**హైదరాబాద్,విశాల భారతి:** గత తొమ్మిది ఏళ్ళుగా కేసీఆర్ పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనమైందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గురునానక్ యూనివర్సిటీలో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన పై స్పందించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్ కనుసన్నల్లోనే రాష్ట్రంలో నకిలీ యూనివర్సిటీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని ఆరోపించారు. యూనివర్సిటీ ఛాన్స్లర్, రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందర్ రాజన్ అనుమతి లేకుండానే గురునానాక్,శ్రీనిధి,కావేరి,నిక్ మార్ ఇంజనీరింగ్ కాలేజీలు నకిలీ యూనివర్సిటీల పేరుతో గడిచిన విద్యాసంవత్సరం వేలాది మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చి ఘోరంగా మోసం చేయడం అన్యాయమన్నారు.నకిలీ యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందిన వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.ఏ విద్యార్థుల ప్రాణాల త్యాగాలు,పోరాటాల వల్ల ఏర్పడ్డ తెలంగాణలో నేడు విద్యార్థి లోకానికి తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రో. రవీందర్ గుప్తా లంచం తీసుకుంటూ ఎసిబి కి పట్టుబడ్డాడంటే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా మారిందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్ని కోట్లు కల్వకుంట్ల కుటుంబం చేతులు తాకితే వైస్ ఛాన్సలర్ పోస్టులు వస్తున్నాయో ఇక చెప్పనక్కర్లేదని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ఉస్మానియా, కాకతీయ,పాలమూరు, మహాత్మాగాంధీ,తెలంగాణ వంటి అనేక విశ్వవిద్యాలయాలను శిథిలావస్థకు చేర్చి,ప్రయివేట్ యూనివర్సిటీలు,నకిలీ యూనివర్సిటీలకు అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలియకుండ రాష్ట్రంలో నకిలీ యూనివర్సిటీలు వెలిశాయా? అన్ని ప్రశ్నించారు.ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఏం చేస్తున్నట్లని ప్రశ్నించిన ఆయన తక్షణమే విద్యాశాఖ మంత్రిని మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.నకిలీ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు ఇచ్చి,విద్యార్థులు వారి తల్లిదండ్రులను మోసం చేసిన యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి,నకిలీ యూనివర్సిటీలను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు.







## అభివృద్ధి పనులకు సహకారం'

**రంగారెడ్డి బ్యూరో, విశాల భారతి:** బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్ 15వ వార్డు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. శ్రీ పద్మావతి కాలనీ అసోసియేషన్ తరపున ఇబ్రాం శేఖర్‌ను స్థానికులు సన్మానించారు. కాలనీలో ప్రధాన సమస్యలపైన తాగునీరు, యూజీడీ, కరెంట్ సమస్యలను త్వరితగతిన పూర్తిచేశారని డిప్యూటీ మేయర్‌ను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి లో ప్రజలకు నిరంతరం తోడుంటానని తెలిపారు. త్వరలోనే సీసీ రోడ్డు సమస్య తీరుతుందని హామీ ఇచ్చారు. యువత, చిన్నారులు ఉన్నత చదువులు చదివి సరైన బాటలో పయనిస్తేనే సమాజ మార్పు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాను చందర్, శ్రీకాంత్, రాజేందర్, లక్ష్మీ నరసింహ, విశాల్, చెన్నారెడ్డి, నిఖిల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కామెంట్స్
- ఎస్11వారసత్వం కేవలం ఎంట్రీకే ఉపయోగపడుతుందని వ్యాఖ్య



అసెంబ్లీ ఎన్నికల ముంగిట రాష్ట్రంలో రాజకీయాలు కాకరేపుతున్నాయి. పార్టీలన్నీ ఇప్పటి నుంచే ఓటర్లను ఆకర్షిందించడమేచేందుకు హామీల వర్షం కురిపిస్తున్నాయి. అధికారం కోసం ప్రతిపక్షాలు కేసీఆర్‌ను గద్దె తమ లక్ష్యమని బల్ల గుద్ది చెబుతుండగా.. మరోవైపు అధికార పార్టీ నేతలు మూడోసారి తమ సర్కారే అధికారం చేజిక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తన ఛాంబర్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి... రాబోయే ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్‌దేనని జోస్యం చెప్పారు. ఈ క్రమంలోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయనని.. ఎమ్మెల్సీగా తనకు ఇంకా నాలుగేళ్లు పదవీ కాలం ఉందని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. పార్టీ అధిష్ఠానం అవకాశం ఇస్తే తన కుమారుడు అమిత్ పోటీలో ఉంటారన్నారు. ఒకవేళ టికెట్ ఇవ్వకపోతే పార్టీ కోసం పని చేస్తామని.. వారసులకు పదవుల కోసం పార్టీలు మారాల్సిన అవసరం లేదన్నారు. వారసత్వం కేవలం ఎంట్రీకే ఉపయోగపడుతుందని.. వ్యక్తిగతంగా ప్రజల మద్దతు పొందిన వారికే భవిష్యత్తు ఉంటుందని గుత్తా అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు ఎవరూ వెళ్లే అవకాశం లేదన్నారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ సీఎంగా బీఆర్ ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని గుత్తా ధీమా వ్యక్తం చేశారు.

**అందుకే సీఎం పట్నాలో విపక్షాల సమావేశానికి వెళ్లలేదు :**

కాంగ్రెస్ లేని కూటమి తమ విధానమని కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారని.. అందుకే పట్నాలో విపక్షాల సమావేశానికి వెళ్లలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రాష్ట్రానికి అన్యాయమే చేసింది తప్ప.. ఒక్క న్యాయం చేయలేదని సుఖేందర్‌రెడ్డి ఆరోపించారు. రెండు రాష్ట్రాలకు విభజన హామీలను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ లౌకిక పార్టీ అని.. బీజేపీతో కలిసి పని చేయదన్నారు. ఏపీ, తెలంగాణ భూముల ధరలపై చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలనే తాము ప్రస్తావిస్తున్నామన్నారు.



### కోటగుళ్ళ లో ఎస్ఐ దంపతుల పూజలు

**విశాలభారతి - గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో శుక్రవారం గణపురం ఎస్ఐ మ్యాక అభినవ్ రవళిక దంపతులు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. వారి కుమారుడు రక్షిత్ వీర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గోశాల గోమాతలకు పండ్లను అందజేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం అర్చకులు ముసునూరు నరేష్ వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.

### 26 బీసీ కులాలను వెంటనే కలపాలె

**హైదరాబాద్ - విశాలభారతి:** తెలంగాణలో తొలగించిన 26 బీసీ కులాలను వెంటనే కలపాలని 26 కులాల జేఏసీ చైర్మన్ ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. కులాలను ఆదుకోవాల్సింది పోయి తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయం నుండి ఆళ్ల రామకృష్ణ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తొలగించిన 26 బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 25న సికింద్రాబాద్ తిరుమలగిరిలోని సూర్య టెంపుల్ గౌరీ భవనంలో బీసీ కులాల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తో పాటు ప్రతిపక్ష నాయకులు రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కాసాని జ్ఞానేశ్వర్, షర్మిల, కమ్యూనిస్టు పార్టీల కార్యదర్శులు పాల్గొంటున్నారని ప్రకటనలో తెలిపారు.




## ఎల్లన్న ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

**మహబూబాబాద్ - విశాల భారతి :** సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమ దళపతి కామ్రేడ్ చంద్ర కృష్ణ మూర్తి ఎల్లన్న 27వ వర్ధంతి సభను స్థానిక న్యూడెమొక్రసీ కార్యాలయం గార్ల యందు న్యూడెమొక్రసీ మండల నాయకులు కామ్రేడ్ మట్టపల్లి వీరభద్రం అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో న్యూడెమొక్రసీ గార్ల మండల కార్యదర్శి జి సక్రు మాట్లాడుతూ కామ్రేడ్ ఎల్లన్న యవ్వన దశలోనే ఈ దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడంలో చైతన్యపు దారుల వైపు పయనించాడని రీవజనిస్టు విధానాలకు వ్యతిరేకంగా విప్లవరాజకీయాలను చేపట్టాడని గోదావరి లోయ ప్రతిఘటన పోరాటానికి కేంద్రబిందు వై రైతు కూలి రంగంలో వ్యవసాయ కూలి సమస్యలపై గొంతే ప్రదర్శించారని మార్క్సిజం వెలుగుల్లో మహో ఆలోచన దారుల్లో ప్రజలను సమీకరించారని ఆయన అన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ అవసరాల రీత్యా ఉమ్మడి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేసే పార్టీని విస్తరించాడని ఆ క్రమంలోనే వరంగల్ జిల్లా లడాయి గడ్డ వద్ద పోలీసులు బూటకపు ఎన్కౌంటర్లో కాల్చి చంపారని కామ్రేడ్ చంద్రకృష్ణమూర్తి ఎల్లన్న ఏ ఆశయ సిద్ధికోసమైతే తమ ప్రాణాలను అర్పించారు. ఆశయ సిద్ధి కోసం పోరాడవాలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీమండల నాయకులు మానియా, గణేష్, వి సక్రు, పీవైల్ నాయకులు జగన్, లాల, నబి,వెంకటేశ్వర్లు, భద్రాజి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



### కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ'

**తుర్కయంజాల్, విశాల భారతి:** కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని, అలాంటి కార్యకర్తలకు బీఆర్ఎస్ నిరంతరం అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడలో ఇటీవల రోడ్డుప్రమాదానికి గురై చనిపోయిన మర్రి బాలరాజు కుటుంబ సభ్యులకు రూ.2లక్షల బీఆర్ఎస్ బీమా చెక్కును ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ తుర్కయంజాల్ మున్సిపల్ అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ కల్యాణ్‌నాయక్, కౌన్సిలర్ సిద్ధాల జ్యోతి జంగయ్య, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ కందాల బలదేవరెడ్డి, నాయకులు మోహన్ గుప్తా, పుల్లగుర్రం విజయానంద్‌రెడ్డి, బిందు రంగారెడ్డి, సామ శ్రీనివాసరెడ్డి, బుడ్డ విజయ్‌బాబు, పల్లపు ఆంజనేయులు, గంగని శ్రీనివాస్, పసుల దేవేందర్, శీలం మానయ్య, యార కుమార్, ప్రవీణ్, శోభ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## నా తమ్ముడికి ఎల్‌బీ నగర్ టికెట్ ఇవ్వండి

- కచ్చితంగా కాంగ్రెస్‌లోకి తీసుకొస్తా..
- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే ఎదుట కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రపోజల్



**విశాలభారతి, హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు దూకుడు పెంచారు. ఇతర పార్టీల నాయకుల చేరిక, క్షేత్ర స్థాయి కార్యకర్తలను సమాయత్తం చేయడంపై దృష్టి పెట్టారు. నిన్న, మొన్నటి వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ.. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా క్రియాశీలంగా మారిపోయారు. వైఎస్ షర్మిల పార్టీ విలీనం, తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తిరగి పార్టీలో చేరడంపై వెంకట్ రెడ్డి ముందుండి వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చేరికలు, విలీనాలను అనధికారికంగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాజాగా బెంగళూరులోని కుమారకృప గెస్ట్ హౌస్‌లో శివకుమార్‌తో భేటీ అయ్యారు. దాదాపు గంట సేపు సాగిన ఈ భేటీలో పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా రాజగోపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లోకి చేరాలనుకుంటున్న విషయంతో పాటు.. వైఎస్ షర్మిల పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అంశం కూడా చర్చకు వచ్చింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఎల్బీనగర్ టికెట్ కేటాయిస్తే.. తప్పకుండా పార్టీలో చేరతారని శివకుమార్‌కు వెంకట్‌రెడ్డి చెప్పినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో ఎల్బీనగర్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన దేవినేని సుధీర్ రెడ్డి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో జాయిన్ అయ్యారు. ఎల్బీనగర్ నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు బరిలోకి దిగాలనే ఆసక్తితో ఉన్నారు. అయితే రాజగోపాల్‌కు టికెట్ ఇస్తే కచ్చితంగా గెలుస్తాడని వెంకట్ రెడ్డి చెప్పినట్లు సమాచారం. మరోవైపు వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అంశం కూడా చర్చకు వచ్చింది. కాగా, కాంగ్రెస్ పార్టీలో వైఎస్ షర్మిల పార్టీ విలీనానికి ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ, తెలంగాణలో రాజకీయం చేయడానికే మీ నాయకులు ఒప్పుకోవడం లేదని కోమటిరెడ్డికి డీకే శివకుమార్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యలతో ఈ విషయం చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని.. రాజగోపాల్ గురించి హైకమాండ్ దృష్టికి తీసుకొని వెళ్తానని డీకే మాట ఇచ్చారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధిష్టానం పెద్దలను కలిశారు. అప్పుడే డీకేను కలవాలంటూ ప్రియాంక గాంధీ సూచించినట్లు తెలుస్తున్నది. తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితి పూర్తిగా ఆయనకు వివరించాలని కోరినట్లు సమాచారం. ఈ మేరకు శుక్రవారం కోమటిరెడ్డి.. డీకేను కలిసి అన్ని విషయాలు కూలంకషంగా వివరించారు. దివంగత వైఎస్ఆర్‌తో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి సాన్నిహిత్యం ఎక్కువగా ఉండేది. ఆ కుటుంబ పట్ల కూడా వెంకట్ రెడ్డి అభిమానం చూపిస్తారు. ఈ నేపథ్యంలోనే షర్మిల వ్యవహారం కూడా డీకే శివకుమార్ దృష్టికి వెంకట్ రెడ్డి తీసుకెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### షర్మిల కాంగ్రెస్ అధిష్టానంతో టచ్‌లో ఉన్నారు

- టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జీ మాణిక్‌రావు థాక్రే సంచలన వ్యాఖ్యలు*

**హైదరాబాద్-విశాల భారతి:** వైఎస్సార్టీపీ చీఫ్ షర్మిలతో కాంగ్రెస్ టచ్‌లో ఉందని టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే తెలిపారు. షర్మిల వల్ల ఏపీలో కాంగ్రెస్ పార్టీకి చాలా లాభమని పేర్కొన్నారు. తెలంగాణలో పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేస్తున్నారని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పార్టీ కోసం గట్టిగా పోరాడుతున్నారని కొనియాడారు. భట్టి పాదయాత్ర పార్టీకి చాలా దోహదం చేస్తుందని థాక్రే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రియాంక గాంధీ తెలంగాణపై చాలా ఫోకస్ పెట్టారని తెలిపారు. రెండు మూడు రోజుల్లోనే ప్రియాంక పూర్తిస్థాయి కార్యాచరణకు సిద్ధమవుతున్నారని ప్రకటించారు. బీజేపీ నుంచి కీలక నేతలు తమ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని ప్రజలు కూడా అర్థం చేసుకుంటున్నారని మాణిక్‌రావు తెలిపారు.

### నేడు గ్రూప్4 హాల్‌టిక్కెట్లు విడుదల

**జూలై 1వ తేదీన పరీక్ష**

**హైదరాబాద్-విశాల భారతి** గ్రూప్4 నియామక పరీక్ష హాల్‌టికెట్లను శనివారం నుంచి జారీ చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ (రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్) వెల్లడించింది. టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. మొత్తం 8,180 గ్రూప్4 ఉద్యోగాలకు రాష్ట్ర వ్యాప్తంగా 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జులై 1న రెండు సెషన్లలో పరీక్ష జరగనుంది.








# సంగారెడ్డి ప్రజలు కేసీఆర్ మాటలకు ఈ సారి మోసపోరు

○ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప*

**హైదరాబాద్-విశాల భారతి:** కెసిఆర్ మాటలకు మోస పోవడానికి సంగారెడ్డి జిల్లా ప్రజలు ఈసారి సిద్ధంగా లేరని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో సంగప్ప మాట్లాడుతూ కేసీఆర్ పటాన్ చేరు సభలో పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. మాయ మాటలు చెప్పడం కెసిఆర్ నైజం అని మరోసారి రుజువైందని సంగప్ప అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ప్రజా సంగ్రామ యాత్రలో సంగమేశ్వర బసవేశ్వర

ఎత్తిపోతల పథకం ప్రకటించి ఇంకా ఎందుకు పనులు ప్రారంభిస్త లేరని నిలదీసినందుకు గతేడాది ఫిబ్రవరిలో నారాయణఖేడ్లో శంకుస్థాపన చేశారని సంగప్ప చెప్పారు. అయితే ఏడాదిన్నర అవుతున్న తట్ట మట్టి తీయ లేదని, గజం గుంత తవ్వ లేదని ఆయన ఆరోపించారు. పైగా హరీష్ రావు ఈ మధ్యకాలంలో మళ్లోసారి శంకుస్థాపన పేరుతో హడావుడి చేసి మోసం చేసే ప్రయత్నం చేశారని సంగప్ప దుయ్యబట్టారు. మామ ఒకసారి, అల్లుడు ఇంకోసారి శంకుస్థాపన చేస్తారు కానీ బడ్జెట్లో మాత్రం ఒక్క పైసా కేటాయించ లేదని సంగప్ప విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్లోనే సంగమేశ్వర బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించే వారు అని, ఒక్క పైసా కూడా బడ్జెట్లో కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్లో ఈ ఎత్తి పోతల పథకం గురించి కనీస ప్రస్తావన కూడా చేయలేదని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఒక్క అభివృద్ధి అని కూడా జరగలేదని కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని సంగప్ప వివరించారు. నేడు సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూముల ధరలు పెరిగాయంటే ఆ క్రెడిట్ నరేంద్ర మోడీ గారిది అని చెప్పారు. సంగారెడ్డి నాందేడ్ హైవే నిర్మాణం వల్ల తమ ప్రాంతంలో వ్యవసాయ భూముల ధరలు పెరిగాయని ఆయన చెప్పారు. ఇందులో కేసీఆర్ పాత్ర ఏముందో చెప్పాలని సంగప్ప నిలదీశారు. కేవలం సంగారెడ్డి జిల్లాలో సభ పెట్టి మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఈసారి సంగారెడ్డి జిల్లా ప్రజలు మోసపోవాదానికి సిద్ధంగా లేరని సంగప్ప చెప్పారు. పటాన్ చేరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర గౌడ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, విట్టల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర రావు దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి బీజేపీ

**మణుగూరు - విశాలభారతి :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన 9సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన "ఇంటింటికి బీజేపీ" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మణుగూరు మండలం శేషగిరి నగర్, గ్రామంలో, బూత్ పరిధిలో శక్తి కేంద్ర ఇంచార్జ్ మీసాల దుర్గారావు, టౌన్ అధ్యక్షులు లింగంపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ పినపాక నియోజక వర్గ కన్వీనర్ భిక్షపతి హాజరై ఇంటింటికి వెళ్లి సేవ,సుపరిపాలన, పేదల సంక్షేమ పథకాలను వివరించారు. పినపాక నియోజక వర్గ కన్వీనర్ భిక్షపతి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలో గత 9 ఏండ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. శేషగిరి నగర్ గ్రామనివాసి, మాజీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు తార ప్రసాద్ మోడీగారు 9 ఏండ్ల పాలనలో చేపట్టిన విజయాలు, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గ్రామంలో ఉన్న ప్రతీ ఒక్కరిని పేరు పేరున పిలుస్తూ, సందడిగా కార్యక్రమంలో పాల్గొని నూతన ఉత్సాహాన్ని కార్యకర్తల్లో నింపారు. బిజేపి పార్టీ ఆదేశానుసారం పినపాక నియోజకవర్గ పరిధిలోని శేషగిరి నగర్ బూత్ పరిధిలో దాదాపు 90 కుటుంబాలను కలిసి కరపత్రాలు పంచి, డోర్ స్టిక్కర్లు అంటించి , నరేంద్ర మోడీ పాలనకు మద్దతుగా టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయించడం జరిగింది అన్నారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించడం తోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ పార్టీ అవినీతి పాలనను బీజేపీ నిజాయితీ పూర్వక పాలనను పోల్చి చెప్పారు.రాబోయే ఎన్నికల్లో బీజేపీ కి ఓటు వేయాలని ,తెలంగాణ అభివృద్ధి కేవలం భారతీయ పార్టీ తోనే సాధ్యమని, డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఈసాల వెంకటేశ్వర్లు శక్తి కేంద్ర ఇంచార్జ్ మీసాల దుర్గారావు మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిర్ర సరస్వతి మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్రోజు నాగమణి. పట్టణ ప్రధాన కార్యదర్శి బీర రమేష్ ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు అనబత్తుల వెంకన్న సీనియర్ నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు ప్రశాంత్ కేకే రావు రోహిత్, జ్ఞానదీప్, మున్నా కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ బిసి మోడల్ స్కూల్ హాస్టల్స్ ప్రారంభించాలి

**మహబూబాబాద్ - విశాలభారతి :** నర్సింహులపేట మండలంలో ఉన్న ఎస్సీ, బీసీ, మోడల్ స్కూల్ హాస్టల్లను ప్రారంభించాలని ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ నర్సింహులపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీసు ముందు ధర్నా నిర్వహించి ,అనంతరం ఎంపీడీవో సత్యనారాయణ వినతిపత్రం అందజేసినారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ స్కూల్ ప్రారంభం అయి దాదాపు 10 రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు హస్టల్లు ప్రారంభించక పోవడం ఏంటని ప్రశ్నించారు. అలాగే మోడల్ స్కూల్ హస్టల్లో కరెంట్ సదుపాయం లేక విద్యార్థినీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. హస్టల్లో సరైన మరుగుదొడ్లు లేక విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది అన్నారు. తక్షణమే నర్సింహులపేట మండల ఉన్న హస్టల్లను ప్రారంభించి, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కో కన్వీనర్ కందుకూరి యశ్వంత్, మండల నాయకులు మహేష్,గణేష్,నవీన్ ,ప్రవీణ్, యాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి బీసీ సెల్, విద్యార్థి విభాగాలు కృషి చేయాలి..

తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్..



**హైదరాబాద్ విశాల భారతి:** తెలుగుదేశం పార్టీకి బీసీ సెల్, విద్యార్థి విభాగాలు వెన్నుముక లాంటివాని, ఈ విభాగాలు క్రియాశీలక భూమిక పోషిస్తూ పార్టీ బలోపేతం కోసం పాటుపడాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాలైన బీసీ సెల్, విద్యార్థి విభాగమైన టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపతి సతీష్, విద్యార్థి విభాగం టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా పార్లపల్లి రవీందర్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. 1982లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి బీసీ సెల్ అనుబంధ విభాగం చాలా కీలకమన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించింది బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాల రాజ్యాధికారం వచ్చే దిశగా తోడ్పాటు అందించేందుకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని. నాడు మాండలిక వ్యవస్థను ఏర్పాటు చేసి రాజకీయలపై స్పృహలేని వర్గాలను రాజకీయాల్లోకి ప్రోత్సహిస్తూ... రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్ దేనిని అన్నారు. ఆ క్రమంలోనే నేడు రాజకీయాలు శాసిస్తున్న బీసీ నేతలంతా తెలుగుదేశం పార్టీలో ఓనమాలు దిద్దిన వారే. ఆ రిజర్వేషన్ల ఫలితంగా సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు జిల్లా చైర్మన్లు మండల పార్టీ అధ్యక్షులుగా రాజకీయాల్లో ప్రారంభించి అనేకమంది నేతలు ఉన్నత పదవుల్లో ఉన్నారని, అందుకు ప్రతి గ్రామంలోకి వెళితే బీసీలంతా తెలుగుదేశం పార్టీ జెండాను ఆక్కును చేర్చుకొని ఆదరిస్తారని తెలిపారు. నేడు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆదరణ చూసి ఇతర పార్టీల నేతలు ఆసక్తిగా పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. అందుకు అనుగుణంగా బీసీ సెల్ కీలక పాత్ర పోషిస్తూ.. పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతూ.. పార్టీలకు వచ్చే వారందరికీ స్వాగతం పలకాలని కోరారు.



## ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలి.

**మహబూబాబాద్ - విశాలభారతి :** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోదుగుల గూడెం జిల్లా పరిషత్ సెకండరీ ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాల నుండి మోదుగుల గూడెం ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం చేసినా తరువాత విద్యార్థులు నీళ్ల లేక దాహం తీరక నీళ్ల కోసం బయట వెళ్లి దుకాణంలో మంచి నీళ్లు తీసుకొని తాగవలసిన పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేకపోవడం సిగ్గుచేటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దశాబ్ది ఉత్సవాల మీద ఉన్న చిత్తశుద్ధి విద్యా రంగంపై లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మోదుగుల గూడెం జిల్లా పరిషత్ సెకండరీ ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలని లేనియెడల భారీ ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహించి ఎమ్మెల్యే రెడ్యా నాయక్ ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

**పాలకుర్తి - విశాల భారతి** పాలకుర్తి మండల ఎంపీపీఎస్ నందు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల దాత కాశెట్టి హేమలత ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ యాకాంత రావు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంపి శోభారాణి మేడం చైర్మన్ గుండె సోమయ్య ప్రముఖులు డా.మల్లేష్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోగు ఆంజనేయులు ఉపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాస్ ఏ సంధ్యారాణి సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి ఎంపీపీ ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు దాదాపు 7500 విలువగల నోటు పుస్తకాలు ,పలకలు, పెన్నులు ,పెన్సిళ్లు మొదలగునవి ఏ సంధ్యారాణి మేడం అక్కగారైన కాశెట్టి హేమలత బహుకరించడం జరిగినది. అంత విలువైన నోట్ బుక్స్ బహుకరించినందుకు గాను గ్రామ సర్పంచ్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఎస్ఎంసి చైర్మన్ పాఠశాల ఉపాధ్యాయులు మేడం శాలువాతో సత్కరించడం జరిగినది. హేమలత మేడం వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలతో పాటు పక్క గృహాలు మంజూరు చేయాలి

**మహబూబాబాద్ - విశాలభారతి :** నిరుపేదలైన ప్రజలకు పక్క గృహాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని అలాగే అనేక మంది వృద్ధాప్యంలో ఉండి కూడా పెన్షన్లు పొందలేకపోతున్నారని తక్షణం పక్క గృహాలతో పాటు పెన్షన్లు కూడా మంజూరు చేసి ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం సిపిఐ న్యూడెమోక్రసీ గార్ల మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక న్యూడెమోక్రసీ కార్యాల నుండి నెహ్రూ సెంటర్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఎంపీడీవో గారికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి సక్రు ప్రసంగిస్తూ కేసీఆర్ తొమ్మిది సంవత్సరాల పాలనలో అదిగో ఇదిగో అని డబల్ బెడ్ రూమ్ ఇల్లు కల్పిస్తామని ఇళ్ల స్థలాలు లేనివారికి స్థలాలు ఇస్తూ ఇల్లు కూడా కట్టిస్తామని ప్రాగల్ పాలు పలికిన కెసిఆర్ నేటికీ 9 సంవత్సరాలు గడుస్తున్న ఈ ఒక్క పేదవాడికి స్థలం ఇవ్వకపోగా ఇల్లు కట్టిన చరిత్ర కూడా లేదని మాటల గారితో ప్రజలను మోసం చేస్తున్నాడని సక్రు ఆందోళన వ్యక్తం చేశారు. దళితులకు మూడెకరాల భూమి పోడు సాగుదారులకు పట్టాలిస్తామని దళితుడికి ముఖ్యమంత్రి చేస్తానని నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని అందరికీ ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి మాటలకే పరిమితం తప్ప ఆచరణలో ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలకు మోసం చేస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేదలైన వారికి ఇళ్ల స్థలాలు పెన్షన్లు నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి మట్టపల్లి వీరభద్రం, ఉపాధ్యక్షులు ఎం మానియా, వాంటెడ్ సక్రు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి సిహెచ్ గణేష్, అధ్యక్షులు జగన్, నాయకులు గోళ్ళ మాధవ రావు, మంగ్య, దబ్బేటి శారద, పాలెపు వెంకటేశ్వర్లు, భద్రాజి, సర్వయ్య, రామదాసు, అనురాధ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు

**మోతె - విశాలభారతి :** మండల పరిధిలోని పలు గ్రామాలలో దేవాలయ అభివృద్ధి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసినట్లు దేవాలయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. వాటిలో నర్సింపురం గ్రామానికి యాబై లక్షలు సర్వారం గ్రామానికి మరో యాబై లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు యాదవ్, జిల్లా నాయకుడు ఏలూరు వెంకటేశ్వరరావు,వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మహర్షి పాఠశాలపై చర్యలు ఏవి ?



**మహబూబాబాద్ - విశాలభారతి** ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహర్షి పాఠశాలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని జిల్లా కార్యదర్శి కేలత్ సాయికుమార్ అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు విరుద్ధంగా పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ అమ్ముతున్న అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేటు పాఠశాలలు ఇష్టనుసారంగా ఫీజులు పెంచి మధ్యతరగతి తల్లితండ్రుల దగ్గర జలగల్లాగా డబ్బులు గుంజుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అండదండలతో విద్యార్థి సంఘాల నాయకులను బెదిరింపులకు గురిచేసి ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేస్తున్నారని అన్నారు. విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తే ఏ ఒక్క ప్రైవేటు పాఠశాలను కూడా వదిలి పెట్టే పరిస్తితి లేదని హెచ్చరించారు. ఇకనైనా జిల్లా విద్యాశాఖ అధికారులు. స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలకు వత్తాసు పలుకుతున్న ఎం ఈ ఓ పులచంద్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ కరువైందని అందుకే జిల్లాలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఆగడాలు హద్దు అదుపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న ప్రైవేటు పాఠశాల చర్యలు తీసుకునేంత వరకు పోరాటం ఆగదని రాజకీయ నాయకులు అండదండలతో బెదిరిస్తున్న బడా కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాన్ని ఒక్కటే చెప్తున్నాము మీరు మమ్మల్ని బెదిరించిన పేద విద్యార్థులు న్యాయం జరిగేంత వరకు జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని అన్నారు తక్షణమే అధికారులు స్పందించి ప్రభుత్వం నియమ నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు లేనియెడల ఎస్.ఎఫ్.ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమము ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ... తక్షణమే పాఠశాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని వారు ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు గుగులోత్ సూర్య ప్రకాష్, బానోత్ సింహాద్రి, జిల్లా కమిటీ సభ్యులు కదారి ప్రవీణ్, పట్టణ నాయకులు రాకేష్ మోహన్ పాల్గొన్నారు.



## డాక్టర్ గోళ్ళభూపతి రావు ను సన్మానించిన విశ్రాంత ఉద్యోగులు

**విశాలభారతి - భద్రాచలం:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవలలో భాగంగా రవీంద్ర భారతి ఆడిటోరియం హైదరాబాద్ లో జరిగిన హరితోత్సవం కార్యక్రమం నందు భద్రాచలవాసి ప్రముఖ పర్యావరణ ప్రేమికులు బంగారు నంది అవార్డు గ్రహీత లయన్ డా. గోళ్ళ భూపతి రావు భద్రాచలం గ్రామంలో చేసిన పర్యావరణ కార్యక్రమములను మరియు గ్రీన్ భద్రాద్రి లో గత 12 సం. నుండి వారు చేసిన సేవలకు గుర్తింపుగా హరితోత్సవ తెలంగాణ ప్రభుత్వ పురస్కారంను అటవీ శాఖ మాత్యులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మరియు చీఫ్ కన్సర్వే టర్ అఫ్ ఫారెస్ట్స్ డి యమ్. డో బ్రియేల్ హైదరాబాద్ వారు ప్రదానం చేయడం చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు సంఘం దుస్సాలువతో ఘనంగా సన్మానించారు.

## వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన వారోత్సవం

**విశాలభారతి - పెన్పహాడ్ :** తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కమిటీ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన కార్యక్రమం జూన్ 15 నుంచి 30 వరకు జరుపుటకు వయోవృద్ధుల వేధింపుల తీవ్రతను గుర్తించిన ఐక్యరాజ్యసమితి 2011 లో వీటి నివారణకు వయోవృద్ధులకు మరియు సమాజమునకు అవగాహన కల్పించుటకు జూన్ 15 నాడు వరల్డ్ ఎల్డర్ అవేర్నెస్డే గా పరిగణించి ఆరోజు సభలు సమావేశాలు పెట్టి చైతన్యం కలిగించాలని కోరుచున్నాము. ఈ రోజు వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన వారోత్సవాల సందర్భంగా పెన్పహాడ్ బస్టాండ్ నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి పోలీస్ స్టేషన్లో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఎన్ రామచంద్రారెడ్డి, మరియు పి టి ఓ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరే రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఎకరాలపై తప్పుడు రాజకీయాలు



**విశాలభారతి, ఏపీ:** పవన్ కల్యాణ్ ఎవరి కోసం రాజకీయాలు చేస్తున్నారో అందరికీ తెలుసు. వ్యతిరేక ఓటు చీలకూడదని అన్నప్పుడే ఎవర్ని సీఎంని చేయటానికి పవన్ ప్రయత్నిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు కావాల్సిన స్క్రిప్టు ఎల్లోమీడియా నుంచే వస్తుంది. ఒక పథకం ప్రకారం కథ నడుపుతున్నారు. టీవీలో చర్చలు, ఆ తర్వాత గవర్నర్‌ని కలవటం వంటివన్నీ ఆ స్క్రిప్టులో భాగం. ఏపీలో గంజాయి లాంటివి లేకుండా చేసినా కావాలని ఆరోపణలు చేస్తున్నారు'' అంటూ సజ్జల దుయ్యబట్టారు. గతంతో పోల్చితే ఇప్పుడు అన్యాయం జరిగితే నేరుగా ఫిర్యాదులు చేసే పరిస్థితి నెలకొంది. టీడీపీకి ఏ అంశాలు లేనందున ఏదో ఒక బురద జల్లేపని చేస్తున్నారు. విశాఖపట్నం ఎంపీ తన వ్యాపారాల గురించి అన్నదొకటి, మీడియా రాసినదొకటి. కులాల మధ్య చిచ్చుపెట్టటం ఎప్పుడైనా భూమ్ రాంగ్ అవుతుంది. చంద్రబాబు మ్యానిఫెస్టోని ఆపార్టీ వారే నమ్మే పరిస్థితి లేదు. ముద్రగడ పద్మనాభం తన కులం కోసం పోరాడిన వ్యక్తి. దాన్ని అడ్డుపెట్టుకుని ఆయన పవన్ లాగా రాజకీయ లబ్ది ఏమీ పొందలేదు. పవన్ మాత్రమే కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తారు'' అని ఆయన మండిపడ్డారు. ''తెలంగాణ పల్లెలకు వెళ్తే కరెంటు పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తుంది. హైదరాబాద్‌లో ఎకరం అమ్మితే ఏపీలో వంద ఎకరాలు కొనవచ్చని కేసీఆర్ అంటున్నారు. ముంబాయిలో ఎకరం అమ్మితే ఇంకా ఎక్కువ కొనవచ్చు. అమెరికాలో అమ్మితే పదివేల ఎకరాలు కొనవచ్చు. ఇవన్నీ ఎలక్షన్లు రాబోతున్నందున కేసీఆర్ మాట్లాడుతున్నారని సజ్జల వ్యాఖ్యానించారు.





# సమన్వయంతో ప్రగతి సాధ్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు-విశాలభారతి** ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని అత్యధిక గ్రామపంచాయతీలకు జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు రావడమేనని ఇందుకు ఉదాహరణ అని ఆయన చెప్పారు.శుక్రవారం పటాన్ చెరు మండల పరిషత్ అధ్యక్షురాలు సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పటాన్ చెరు సభలో నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామపంచాయతీకి 15 లక్షల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపు ప్రతి పైసా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు మనపై నమ్మకంతో గురతర బాధ్యత అప్పగించారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో యువత మత్తుపదార్థాలకు బానిస అవుతున్నారని పలువురు ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి డ్రగ్స్ రాకసిని తరిమికొట్టాలని ఆదేశించారు. తాను ఎంపీటీసీగా, ఎంపీపీగా పని చేసిన రోజుల్లో లక్ష రూపాయల మంజూరు కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సొంత నిధులతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు.శంకుస్థాపన చేసి కాలయాపన చేయడం తనకు నచ్చదని తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని మిగతా సమయం అంతా అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో నిమగ్నం కావాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న రామేశ్వరం బండ, కర్దనూరు, గ్రామ పంచాయతీల పాలకవర్గాలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

**ఎమ్మెల్యే జిఎంఆర్ కు సన్మానం..**

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు 15 లక్షల రూపాయల చొప్పున సీఎం కేసీఆర్ చేత మంజూరు చేయించడం పట్ల పటాన్చెరు ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జడ్పిటిసి సుప్రజా వెంకటరెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిను ఘనంగా సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి టికెట్ కేటాయిస్తూ సీఎం కేసీఆర్ ప్రకటన చేయడం పట్ల ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులను మండల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.Nఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఎంపీడీవో బన్సీలాల్, పంచాయతీరాజ్ శాఖ డీఈ సురేష్, డిప్యూటీ ఎమ్మార్వో రాములు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రూ.30 కోట్ల సీఎం నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధి

- అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



**పటాన్ చెరు-విశాలభారతి** అమీన్ పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి 30 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ పటాన్ చెరు బహిరంగ సభలో ప్రకటించడాన్ని చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం పటాన్ చెరు పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలను కోరడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నారాయణఖేడ్లో జరిగిన బహిరంగ సభలో సైతం ముఖ్యమంత్రి కేసీఆర్ అమీన్ పూర్ మున్సిపాలిటీకి 25 కోట్ల రూపాయలు విధులు కేటాయించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సలహాలు, సూచనలతో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కమిషనర్ సుజాత, మున్సిపల్ కౌన్సిలర్లు కల్పన ఉపేందర్ రెడ్డి, బిజిలి రాజు,కొల్లూరు చంద్రకళ గోపాల్, నవనీత జగదీష్,బోయిని బాలమణి బాలరాజు, కవిత శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వరి,కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, యూనుస్,పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చౌటకూరి మహిపాల్ రెడ్డి, లింగం గౌడ్, మహేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు మోసగించేందుకే 'డబుల్' ఇండ్లు ప్రారంభోత్సవం

- 2 లక్షలు దరఖాస్తులు వస్తే.. 2 వేలు ఇండ్లు ఇస్తారా?
- బీజేపి గెలిస్తే ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కబ్జాలను బుల్డోజర్ తో కూల్చుతాం
- మహిపాల్ రెడ్డి ప్రతి స్కాంలో సీఎం కేసీఆర్ వాటా
- పటాన్ చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్



**హైదరాబాద్ -విశాల భారతి** కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం లబ్ధిదారులను ఎంపిక చేయకుండానే ప్రజలను మోసం చేసేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ ఇండ్లను ప్రారంభోత్సవం చేశారని పటాన్ చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండ్ల కోసం 2 లక్షల అప్లికేషన్లు వస్తే 2 వేల మందికి మాత్రమే ఇండ్లు ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. డబుల్ ఇండ్లలో 75 శాతం ఇండ్లు స్థానికులకే ఇవ్వాలి డిమాండ్ చేశారు. లేదంటే ధర్నాలు, ఆందోళనలు చేస్తామని, లీగల్ పోరాటానికి వెనుకాడబోమని నందీశ్వర్ గౌడ్ హెచ్చరించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2014లో కట్టించిన 5 వేల ఇందిరమ్మ ఇండ్లను ఇప్పటి వరకు లబ్ధిదారులకు కేటాయించలేదని అన్నారు.

ఎన్నికలు వస్తున్నాయని ప్రారంభోత్సవాలు చేస్తున్నారు తప్ప ప్రజలకు మంచి చేసే ఉద్దేశ్యం కేసీఆర్ కు లేదన్నారు. పటాన్ చెరులో చెరువులన్ని కబ్జాకు గురయ్యాయని, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కుంట కబ్జా చేసి ఫంక్షన్ హాల్ కట్టుకున్నాడని ఆరోపించారు. ఇది నిజం కాదని చెప్పమనండి శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. బొందల గడ్డ మీద హాస్పిటల్ నిర్మించారని, ఎమ్మెల్యే చేసిన ప్రతి స్కామ్ లో కేసీఆర్ కు వాటా ఉందని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కబ్జాలను బుల్డోజర్ తో కూల్చుతామన్నారు. పటాన్ చెరు సభలో కేసీఆర్ మహిపాల్ రెడ్డిని మరోసారి దీవించాలని ప్రకటించడంతో బీజేపీ గెలిచే మొదటి సీటు పటాన్ చెరు అని అన్నారు. మహిపాల్ రెడ్డిని మళ్ళీ గెలిపిస్తే పటాన్ చెరు వరకు మెట్రో ఏర్పాటు చేస్తామన్నారు, 9 ఏండ్లలో చేయనిది ఇప్పుడు ఎలా చేస్తారని మండిపడ్డారు.కోవర్టులు వారి పద్ధతులు మార్చుకుంటున్నారని, వారు మారకపోతే పేర్లు తప్పకుండా బయట పెడుతానని చెప్పారు. కాంగ్రెస్ కు క్యాండిడేట్లు లేరు, అసలు కాంగ్రెస్ పార్టీ లేవనే లేవదు సోషల్ మీడియాలో వట్టి ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

# కోనసీమ గాలిలోనే పౌరుషం

- యువతపై తప్పుడు కేసులు ఎత్తేయాలి
- సమస్య ఏదైనా వస్తే శాంతియుతంగా చర్చిద్దాం
- కూలీలా పని చేయడానికి వచ్చాను

\- జనసేనాని పవన్ కల్యాణ్



**విశాలభారతి, ఏపీ:** 'కోనసీమ నీరు, తిండి, గాలిలో పౌరుషం ఉంటుంది. ఈ నేలలో బడబాగ్ని దాగి ఉంది. అన్యాయం, తప్పు జరిగితే ఊరుకునే తత్వం ఉండదు. మనుషుల్ని ఇక్కడి వారు ఎంతగా ప్రేమిస్తారో, అభిమానం ఎంతగా చూపుతారో, వారి కోపం కూడా అంతే తీవ్రంగా ఉంటుంది. అయితే పోరాటాలు ఎప్పుడు అహింసాయుత మార్గాల్లో జరగాలి. ఏ ఉద్యమమైనా హింసాయుత వాతావరణంలోకి వెళితే ఆ ఉద్యమం నీరుగారిపోతుంది' అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. వారాహి విజయ యాత్రలో భాగంగా శనివారం సాయంత్రం అమలాపురంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. "మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ఎదుటి వారి హక్కులకు భంగం కలగనీయకుండా మన హక్కులు కాపాడుకోవాలి. ఎదుటి వారి హక్కులకు నువ్వు భంగం కలిగిస్తే కచ్చితంగా అది తప్పే. చట్టం అందరికీ సమానంగా ఉండాలి. నేరం చేసిన వ్యక్తి ఏ కులంలో ఉన్నా ఆ కులంలోని వారు వెనకేసుకురాకూడదు. ఒక దళిత డ్రైవర్ను హత్య చేసి ఇంటికి పార్సిల్ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు మా కులం వాడు అని, 13 ఏళ్ల బాలుడిని పెట్రోల్ పోసి తగులపెట్టిన వారు మా కులానికి చెందిన వారని వారికి వంత పాడుతామా..?' అని ప్రశ్నించారు.

# సీఎం సభ సక్సెస్..అందరికీ శిరస్సు వంచి కృతజ్ఞతలు

- కేసీఆర్ ఆశీస్సులతో అభివృద్ధిలో అగ్రగామిగా పటాన్ చెరు
- హామీల అమలుకు త్వరితగతిన చర్యలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**పటాన్ చెరు-విశాలభారతి** పటాన్ చెరు పట్టణంలో గురువారం జరిగిన ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో పటాన్ చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.పటాన్ చెరు పట్టణంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమానికి సీఎం వస్తున్నారని తెలిపిన మూడు రోజుల్లోనే గ్రామ గ్రామాల నుండి సభను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి ఆయన ధన్యవాదములు తెలియజేశారు.ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన ప్రధాన హామీల అమలుపై శుక్రవారం ఉదయం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుతో చర్చించడం జరిగిందని, శరవేగంగా హామీలను అమలు చేయబోతున్నట్లు మంత్రి తెలిపారని పేర్కొన్నారు. నియోజకవర్గంపై ముఖ్యమంత్రి కేసీఆర్ కు సంపూర్ణ అవగాహన ఉందని, ఇందుకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి 128 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని తెలిపారు. నిధుల మంజూరు సంపూర్ణ సహకారం అందించిన రాష్ట్ర మంత్రులు కేటీఆర్, తన్నీరు హరీష్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జీఎంఆర్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నారు.. నియోజకవర్గ ప్రజాప్రతినిధులుపలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పటాన్ చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని సీఎం కేసీఆర్ వేలాది మంది ప్రజల సమక్షంలో ప్రకటించడం నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు. లక్ష మెజారిటీతో ఎమ్మెల్యే జిఎంఆర్ ను గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఎంపీపీ దేవానందం, జడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కార్పొరేటర్లు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, బాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నేనున్నానన్నారు..భుజం తట్టి భరోసా ఇచ్చారు..

- ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో మరింత ముందుకెళ్తా
- ఎన్ఎంఆర్' యువసేన కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటా
- బీఆర్ఎస్ నేత నీలం మధు ముదిరాజ్



**పటాన్ చెరు-విశాలభారతి** ముఖ్యమంత్రి కేసీఆర్ నేనున్నానని.. తన భుజం తట్టి భరోసా ఇచ్చారని బీఆర్ఎస్ నేత నీలం మధు ముదిరాజ్ తెలిపారు. సీఎం ఆశీస్సులతో ప్రజాసేవలో మరింత ముందుకు వెళ్తానని ఆయన చెప్పారు. పటాన్ చెరు నియోజకవర్గానికి అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు నీలం మధు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, మంత్రులు కేటీఆర్, హరీష్ రావుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. సుఖదుఖాల్లో తన వెంట నడుస్తూ, తనకోసం కష్టపడుతూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్న ఎన్ఎంఆర్ యువసేన కార్యకర్తలకు గుండెల్లో పెట్టుకుంటానని నీలం మధు తెలిపారు. ప్రజలు, యువసేన సభ్యులు తన పట్ల చూపుతున్న అభిమానాన్ని ఇప్పటికీ మరువలేనని అన్నారు. ఎన్ఎంఆర్ యువసేన సేవ కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన భరోసాతో మరింత ఉత్సాహంగా ప్రజల కోసం పని చేస్తానని నీలం మధు ముదిరాజ్ తెలిపారు.

# ముఖ్యమంత్రి కేసీఆర్ హామీలు.. నీటి మూటలే

- 'డబుల్ ' ఇండ్లలో స్థానికులకు 8 వేలు ఇండ్లువ్వాలి
- మళ్లీ గెలిపిస్తేనే మెట్రో లైన్..ప్రజలను మోసం చేయడమే
- ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి




**పటాన్ చెరు-విశాలభారతి** ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలుగా మిగిలిపోతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. శుక్రవారంరామచంద్రపురం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గోదావరి అంజిరెడ్డి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పటాన్ చెరు నియోజకవర్గ పర్యటన ఎన్నికల ప్రచార సభను తలపించిందని అన్నారు. సీఎంకు ఎన్నికలు వచ్చినపుడు మాత్రమే పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలు గుర్తుకు వస్తారా అని మండిపడ్డారు. కొల్లూరు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇంత కాలం లబ్ధిదారులకు ఎందుకు కేటాయించలేరని ఆమె ప్రశ్నించారు. కేవలం ఎన్నికల వస్తున్నాయని హడావుడితో డబుల్ బెడ్రూంలను సీఎం ప్రారంభించారన్నారు.15 వేళ ఇళ్లలో పటాన్ చెరు నియోజకవర్గానికి కేవలం 2 వేలు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. 8 వేల ఇళ్లు నియోజకవర్గానికి కేటాయించాలని గోదావరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలిపిస్తేనే పటాన్ చెరుహయత్ నగర్ మెట్రో లైన్ పూర్తి చేస్తామని సీఎం చెప్పడం..ఈ ప్రాంత ప్రజలను మోసం చేయడమే అవుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రజలను బ్లాక్ మెయిల్ చేసినట్లుగా సీఎం కేసీఆర్ సభలో మాట్లాడారని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలకు ముందే మెట్రో నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ఎత్తుగడలో భాగంగానే హడావుడిగా హామీలు ఇచ్చారనే విషయం ఈ ప్రాంత ప్రజలు గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని మూడు మునిసిపాలిటీలకు 30 కోట్ల చొప్పున నిధులు ఏమూలకు సరిపోతాయని ఆమె ప్రశ్నించారు. హైదరాబాద్ మహా నగరంలో ఉన్న ఈ మునిసిపాలిటీలు రోజూరోజుకి విస్తరిస్తూ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో కనీసం వంద కోట్ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ 15 లక్షలు కాకుండా కనీసం కోటి రూపాయల చొప్పున ఇవ్వాలన్నారు. జీహెచ్ ఎంసీ పరిధిలోని మూడు డివిజన్లకు 25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయాలని కోరారు. పటాన్ చెరులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్లే ఆలస్యం అయిందని విమర్శించారు. ఆస్పత్రి నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 25 శాతం వాటా ఇచ్చి అంతా తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ఫార్మా పరిశ్రమల వాటా నిధులతోనే ఆస్పత్రి నిర్మాణం జరుగుతున్న విషయం పటాన్ చెరు ప్రజలకు తెలుసని చెప్పారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే పటాన్ చెరు, ఇస్నాపూర్ వంటి ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ఎందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిధులు అడగలేదని ప్రశ్నించారు. 2014, 2018 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను రాష్ట్ర పభుత్వం గాలికి వదిలేసిందని.. మళ్లీ ఇప్పుడు ఎన్నికల సందర్భంగా కొత్త హామీలు ఇస్తూ ప్రజలకు మోసం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో ఓడించేందుకు పటాన్ చెరు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ప్రధాని మోదీ పారదర్శక పాలనతో కచ్చితంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రామచంద్రపురం పట్టణ ప్రధాన కార్యదర్శి బలరాం, భూపాల్ రెడ్డి, మల్లేష్, రాజు, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సందిగుడెంలో 'ఎన్ఎంఆర్' యువసేన ఆత్మీయ సమ్మేళనం

- పాల్గొన్న బీఆర్ఎస్ నేత నీలం మధు
- ఎన్ఎంఆర్ యువసేనలో 50 మంది ముస్లిం యువకుల చేరిక
- దర్గా ప్రహరికి 50 వేలు విరాళం అందించిన నీలం

**పటాన్ చెరు-విశాలభారతి** బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ నిర్వతంలోని ఎన్ఎంఆర్ యువసేనలో యువకుల చేరికల పరంపర సాగుతూనే ఉంది.. నీలం మధు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆకర్షితులై పటాన్ చెరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి యువసేనలో చేరుతున్నారు. ఇందులో భాగంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సందిగూడెం గ్రామంలో ఎన్ఎంఆర్ యువసేన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దాదాపు 50 మంది ముస్లిం మైనార్టీ యువకులు నీలం మధు సమక్షంలో ఎన్ఎంఆర్ యువసేనలో చేరారు. వారికి శాలువాలు కప్పి ఆయన యువసేనలోకి ఆహ్వానించారు. గ్రామ పరిధిలోని సయ్యద్ ఖాజా జమలుద్దీన్ సాబ్ దర్గా ప్రాహరి గోడ నిర్మాణానికి నీలం మధు మధు 50,000 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేదలకు, నిస్సహాయులను ఆదుకోవడమే ఎన్ఎంఆర్ యువసేన లక్ష్యమని నీలం మధు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్ఎంఆర్ యువసేనలో చేరవచ్చని కోరారు. ఆదుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ యూసఫ్ ఖాన్, మహమ్మద్ నజీర్ ఖాన్, మహమ్మద్ అజీజ్ ఖాన్, ఖాదర్, జాఫర్, షేక్ ముజిబ్, ముస్తఫా, హిదాయత్, గౌస్, తలారి మధుసూదన్, బాలకృష్ణ, సీహెచ్ సత్యా నారాయణ, శంకర్ చారి, ముస్లిం సోదరులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.







## రామ్- బోయపాటి సినిమా కొత్త రిలీజ్ డేట్ ఖరారు..

'అఖండ' మూవీతో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు బోయపాటి శ్రీను.. ప్రస్తుతం ఎనర్జిటి స్టార్ రామ్ పోతినేనితో భారీ యాక్షన్ సినిమా చేస్తున్నాడు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై చిట్టూరి శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై అనౌన్స్‌మెంట్ నుంచే అంచనాలు పెరిగిపోయాయి. అలాగే ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు రామ్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ వీడియోలో మాస్ లుక్స్‌తో మరింత హైప్ క్రియేట్ చేశారు. అదే మేనియాను కంటిన్యూ చేస్తూ ఈ మూవీ కోసం అదిరే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి గానూ 'స్కంధ'అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి జూన్ 28న ఈ సినిమా ఒరిజినల్ టైటిల్‌ను మేకర్స్ అనౌన్స్ చేయనున్నారని టాక్. ఇక 'స్కంధ' టైటిల్ పరిశీలనలో ఉండగా.. ఇది భుజ బలాన్ని తెలియజేస్తుంది. అంటే తనవాళ్ల కోసం భుజంకాచే హీరో నేచర్‌ను ఇది రిఫ్లెక్ట్ చేస్తోందని అర్థం. యంగ్ హీరోయిన్ శ్రీలీల ఫిమేల్ లీడ్‌గా నటిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 20న విడుదలవుతుందని మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. కానీ తాజా సమాచారం ప్రకారం అంతకంటే ముందే సెప్టెంబర్ 15న ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ నిన్న వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఒక పవర్ ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కాగా ఈ చిత్రం అనుకున్న తేదీ కంటే ముందే వస్తుండటంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.



## నితిన్ కొత్త సినిమాకు టైటిల్ ఇదే..!

యంగ్ హీరో నితిన్ ప్రస్తుతం మంచి హిట్ కోసం ప్రయత్నిస్తున్నాడు. అప్పుడెప్పుడో మూడేళ్ల కిందట భీష్మ మూవీతో బంపర్ హిట్ అందుకున్న నితిన్ మళ్లీ ఇప్పటివరకు హిట్టు వాసనే చూడలేదు. ఎంతో కష్టపడి చేసిన మాచర్ల నియోజకవర్గం సైతం తొలిరోజే డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. దీంతో ఈ సారి ఎలా అయినా హిట్ కొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఈ యంగ్ హీరో పలు సినిమాలతో బిజీగా ఉన్నాడు. అందులో ఏదో ఒక మూవీతో అయినా సరైన హిట్ కొడదామనే కాన్ఫిడెంట్‌లో అయితే ఉన్నట్టు తెలుస్తోంది. ఇక నితిన్ తన ఆశలన్నీ ప్రస్తుతం దర్శకుడు వక్కంతం వంశీ సినిమాపైనే ఉంచాడు. ఈ దర్శకుడితో నితిన్ ఓ భారీ మూవీ చేస్తున్నాడు. ఇప్పటివరకైతే ఈ సినిమాపై ఎలాంటి అంచనాల్లేవు. పైగా వక్కంతం వంశీ లాస్ట్ సినిమా నా పేరు సూర్య ఘోరంగా ఫ్లాప్ అయింది. దాంతో ఈ ప్రాజెక్ట్‌పై పెద్దగా ఎక్స్‌పెక్టేషన్స్ ఏమి లేవు. ఇక మెల్ల మెల్లగా ఈ చిత్రంపై హైప్ తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇకపోతే కుదిరితే వినాయక చవితికి ఈ సినిమాను దింపాలని మేకర్స్ తెగ ప్లాన్ చేస్తున్నారట. షూటింగ్ కూడా ఆల్‌మోస్ట్ ఫైనల్ స్టేజీకి వచ్చేసిందని టాక్. తాజాగా ఈ సినిమా టైటిల్‌కు సంబంధించిన ఓ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతుంది. 'ఎగస్త్రా' అనే టైటిల్‌ను ఈ ప్రాజెక్ట్‌కు ఫిక్స్ చేసినట్టు సమాచారం. ఇలా డిఫరెంట్ టైటిల్ మాదిరిగానే సినిమా కూడా చాలా డిఫరెంట్‌గా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో నిజమెంతుందో తెలియాలంటే మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఇందులో నితిన్ సరసన శ్రీలీల నటించబోతున్నట్లు తెలుస్తోంది.




## నేరుగా ఓటీటీలోకి జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ కొత్త మూవీ..

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ కలిసిన నటించిన మూవీ 'బవాల్'. నితీష్ తివారీ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీ థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలోకి వస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. సాజిద్ నదియావాలా ప్రొడ్యూస్ చేసిన ఈ మూవీ గత ఏప్రిల్ 7నే రిలీజ్ కానున్నట్లు ఈ మూవీ హీరో వరుణ్ ధావన్ చెప్పాడు. అయితే అనివార్య కారణాల వల్ల మూవీ రిలీజ్‌ను వాయిదా వేశారు. ఇక తాజాగా ఈ మూవీకి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చింది. ఈ చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్‌కు సిద్ధమైనట్లు కన్ఫర్మ్ అయింది. ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో జూలై నెలలో రాబోతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా మేకర్స్ తెలిపారు. ప్రతి ప్రేమ కథకు దానిదైన యుద్ధం ఒకటి ఉంటుంది అంటూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఇందులో జాన్వీ, వరుణ్ ధావన్ హగ్ చేసుకొని ఎంతో ఉల్లాసంగా కనిపిస్తున్నారు. అయితే వాళ్ల వెనుక ఈఫిల్ టవర్, కింద యుద్ధ భూమిలో తుపాకీలు చేతబట్టిన సైనికులు ఉండటం చూస్తే.. మూవీ స్టోరీ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉండేలా కనిపిస్తోంది. ఇక ప్రైమ్ వీడియోలో ఇండియాతోపాటు 200 దేశాల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమాలో గతంలో ఎన్నడూ చూడని యూరప్‌ను చూపించబోతున్నట్లు ప్రొడ్యూసర్ సాజిద్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చాడు.

## కంగువ మూవీలో కేజీఎఫ్ విలన్..!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం కంగువ సినిమా చేస్తున్నాడు. భారీ బడ్జెట్తో పీరియాడిక్ యాక్షన్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సూర్య సరికొత్త లుక్లతో ఐదు రోల్స్‌లో కనిపించనున్నాడు. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ తరుణంలో ఈ మూవీలో మరో నటుడు యాడ్ అయినట్టు మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. 'కేజీఎఫ్'పార్ట్ 1, 2 సినిమాల్లో మాథ్యూస్ పాత్రలో నటించిన బీఎస్ అవినాశ్.. ఇప్పుడు సూర్య చిత్రం కంగువలో నటించే అవకాశం దక్కించుకున్నాడు. టాలీవుడ్లోనూ వాల్తేరు వీరయ్య, వీర సింహా రెడ్డి సినిమాల్లోనూ అవినాశ్ నటించాడు. ఇప్పుడు సూర్య భారీ బడ్జెట్ మూవీ కంగువలోనూ ముఖ్య పాత్ర పోషించనున్నాడు. ప్రస్తుతం కంగువ మూవీ షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. బాలీవుడ్ భామ దిశా పటానీ హీరోయిన్గా నటిస్తోన్న ఈ మూవీని.. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ కృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పాలపాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం వస్తోంది. సుమారు రూ.300 కోట్ల బడ్జెట్తో కంగువ మూవీని నిర్మిస్తున్నట్టు సమాచారం.

## టీవీల్లోకి వారసుడు వచ్చేస్తున్నాడు

కోలీవుడ్ స్టార్ నటుడు విజయ్ దళపతి హీరోగా, రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించిన 'వారిసు' తెలుగులో 'వారసుడు' మూవీ బాక్సాఫీసు వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన ఈ మూవీ రూ. 300 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టి బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి వంశీపైడిపల్లి దర్శకత్వం వహించాడు. ఈ మూవీతోనే వంశీపైడిపల్లి దర్శకుడిగా కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక తండ్రి చివరి కోరిక మేరకు అపోహలు, అపార్థాలతో విడిపోయిన తన కుటుంబాన్ని ఓ యువకుడు ఎలా ఏకం చేశాడన్నదే ఈ సినిమా కథ. ఇందులో విజయ్ యాక్టింగ్, ఫ్యామిలీ ఎమోషన్స్ తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించాయి. తెలుగులో ఈ మూవీ రూ.20 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టింది. టాలీవుడ్‌లో రిలీజైన విజయ్ సినిమాల్లో హయ్యెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన మూవీగా ఇది నిలిచింది. ఇదిలా ఉంటే థియేటర్లలో ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకున్న ఈ చిత్రం ఇప్పుడు బుల్లితెర ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఈ సినిమా తెలుగు టీవీ ప్రీమియర్ డేట్ ఫిక్సయింది. జెమిని టీవీలో జూన్ 25న సాయంత్రం ఆరు గంటలకు ప్రసారం కానుంది. మరి టీవీల్లో ఈ చిత్రం ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందో చూడాలి.





## అందుకే తప్పుకుంది..!

మహేష్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రం నుంచి పూజా హెగ్డే తప్పుకుందని తెలిసింది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ షెడ్యూల్స్ అనుకున్న ప్రకారం జరగకపోవడంతో డేట్స్ సర్దుబాటు చేయలేక ఆమె ఈ నిర్ణయం తీసుకుందని చెబుతున్నారు. 'ప్రస్తుతం పూజాహెగ్డే తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఒక్కో చిత్రానికి అంగీకరిచింది. త్వరలో ఈ సినిమాలు సెట్స్‌మీదకు వెళ్లనున్నాయి. ఈ నేపథ్యంలో డేట్స్ క్లాష్ కావొద్దనే ఉద్దేశ్యంతో 'గుంటూరు కారం' చిత్రం నుంచి తప్పుకుంది' అని పూజాహెగ్డే సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ సినిమా నుంచి పూజాహెగ్డే తప్పుకోవడంతో సెకండ్‌లీడ్‌లో నటిస్తున్న శ్రీలీలను ప్రధాన నాయికగా తీసుకోబోతున్నారని సమాచారం. 'గుంటూరు కారం' తదుపరి షెడ్యూల్ ఈ నెలాఖరులో మొదలుకానుంది. వచ్చే ఏడాది జనవరి 13న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.